మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. దశాబ్దాలుగా బీచ్‌ను అభివృద్ధి చేస్తామని పాలకులు, అధికారులు చెప్పడమే తప్ప చేసింది శూన్యం. కనీస సౌకర్యాలు లేకపోవడంతో పర్యాటకులు అటువైపు కన్నెత్తి చూడటంలేదు. ఈ ఏడాది జూలైలో నిర్వహించిన మసులాబీచ్ ఫెస్టివల్ తర్వాత ఇక్కడి పరిస్థితులు మారతాయని భావించారు. ఈ వేడుక ముగిసిన అనంతరం మళ్లీ యథాస్థితికి బీచ్ వచ్చింది. అభివృద్ధి పనులు కాగితాలకే పరిమితం అవుతున్నాయి తప్ప ఆచరణకు నోచుకోవడంలేదు. దీంతో పర్యాటకం అంతా భ్రమేనంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


కనీస సౌకర్యాలు లేని మంగినపూడి బీచ్.. ఇన్‌సెట్‌లో ఎండిపోతున్న కొబ్బరి చెట్లు

# పర్యాటకం భ్రమే!

- మంగినపూడి బీచ్‌లో కనీస సౌకర్యాలు కరువు
- పర్యాటకులు లేక వెలవెలబోతున్న బీచ్ పరిసరాలు
- దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ప్రముఖ పర్యాటక ప్రాంతం
- మసులా బీచ్ ఫెస్టివల్ తర్వాత కూడా మారని పరిస్థితి
- స్టార్ హోటల్స్ నిర్మాణానికి ప్రైవేటు సంస్థలు ముందుకు వచ్చినా భూ కేటాయింపుల్లో జాప్యం
- అధికారుల తీరుపై వ్యక్తమవుతున్న విమర్శలు

**ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం :** మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్‌లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. కాసేపు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడుపుదామని వచ్చే వారికి నిరాశే ఎదురవుతోంది. సముద్రపు అలలు ఎగసిపడుతున్న తీరును కూర్చుని ఆస్వాదించేందుకు ఒక్క కుర్చీ కూడా ఇక్కడ కనిపించదు. ఆకలి వేస్తే తినేందుకు సరైన ఆహార పదార్థాలు సైతం లభించవు. సముద్ర స్నానం చేసిన తర్వాత మహిళలు దుస్తులు మార్చుకునేందుకు కనీస ఏర్పాట్లు కూడా లేవు. దీంతో సముద్ర స్నానాలకు అత్యంత సురక్షితమైన ప్రాంతంగా ఉన్నా కూడా పర్యాటకులు లేక వెలవెలబోతోంది. ఏడాదిన్నర క్రితం పర్యాటకులకు నీడ కల్పించేందుకు బీచ్‌లో విశాఖపట్నం నుంచి తీసుకువచ్చిన 300లకుపైగా కొబ్బరి చెట్లను నాటారు. వాటి సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కొబ్బరి చెట్లు చనిపోతున్నాయి. ఎండిన చెట్లను తొలగించే పనులు కూడా చేయకుండా పర్యాటకశాఖ అధికారులు మిన్నకుండిపోతున్నారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు దగ్గరలో మంగినపూడి బీచ్ ఉంది. హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులకు బీచ్‌లో ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

### ఆలోచన బాగున్నా..

ఈ ఏడాది జూలైలో నిర్వహించిన మసులాబీచ్ ఫెస్టివల్ సందర్భంగా మచిలీపట్నం వచ్చిన అర్జున అవార్డు గ్రహీతలు, వివిధ క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులతో మంత్రి కొల్లు రవీంద్ర, శాప్ చైర్మన్ రవినాయుడు, కలెక్టర్ బాలాజీ మాట్లాడారు. మంగినపూడి బీచ్, గిలకలదిండి హార్బర్ తదితర ప్రాంతాల్లో బీచ్ కబడ్డీ పోటీలు, జలక్రీడలు, కయాకింగ్ పోటీల నిర్వహణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. క్రీడాకారులకు కోచింగ్ ఇచ్చేందుకు ఎలాంటి సౌకర్యాలు కల్పించాలి, అందుకు అవసరమైన భూమి, నిధుల కేటాయింపు తదితర అంశాలపై కూడా మాట్లాడారు. మచిలీపట్నంలో బీచ్ కబడ్డీ, ఇతర క్రీడలను ప్రోత్సహించేందుకు తీసుకోవాల్సిన అంశాలపై పూర్తిస్థాయి నివేదికను తయారు చేసి ఇస్తామని క్రీడా నిపుణులు అప్పట్లో తెలిపారు. ముందుగా మంగినపూడి బీచ్‌ను పర్యాటకులకు ఆహ్లాదం పంచేలా అభివృద్ధి చేస్తే వివిధ క్రీడలను ఇక్కడ నిర్వహించేందుకు అవకాశాలు మెరుగవుతాయని పర్యాటకులు అంటున్నారు.

### పర్యాటకశాఖ పట్టించుకునేనా!

బందరు పోర్టు అభివృద్ధి చెందితే వ్యాపారులు, ఇతరత్రా సంస్థల వారు ఇక్కడకు రావడం ఖాయం. వివిధ పనులపై వచ్చేవారికి ఆహ్లాదాన్ని మిగతా 6లో..

# దుర్గగుడి చైర్మన్‌గా బొర్రా రాధాకృష్ణ

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- కృష్ణాజిల్లా పోరంకి వాసికి పదవి



**విజయవాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్‌గా కృష్ణా జిల్లాకు చెందిన బొర్రా రాధాకృష్ణ (గాంధీ) నియమితులయ్యారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. రాష్ట్రంలోని వివిధ దేవాలయాలు, టీటీడీ ఆలయాల స్థానిక సలహా మండలి చైర్మన్లను నియమించింది. ఇందులో రాధాకృష్ణను దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ పదవి వరించింది. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం పోరంకి గ్రామానికి చెందిన ఆయన విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో ఉన్నారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేసి, ఆ ప్రకటన చేసినప్పటి నుంచి రాధాకృష్ణ రాజకీయాల్లో ఉన్నారు. హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పార్టీ ప్రకటన జరిగినప్పుడు విద్యార్థి నాయకుడిగా అక్కడే ఉన్నారు. ప్రస్తుతం ఆయన భవన నిర్మాణ రంగంలో ఉన్నారు. మరోపక్క పార్టీ ఇచ్చిన ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సినీ నటుడు నందమూరి బాలకృష్ణకు సన్నిహితుడిగా రాధాకృష్ణకు గుర్తింపు ఉంది. రాధాకృష్ణకు అనుకూలంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఇద్దరు ఎంపీలు, ఇద్దరు మంత్రులు, 11 మంది ఎమ్మెల్యేలు లేఖలు ఇచ్చారు. దీంతో సౌమ్యుడిగా పేరు ఉన్న రాధాకృష్ణను ప్రభుత్వం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా నియమించింది.



## రాకింగ్ రోబోస్! 8

- సిద్ధార్థ వర్సిటీలో జాతీయ రోబోటిక్స్ పోటీలు

అనధికార లే అవుట్‌లతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఏళ్ల తరబడి ప్రజలను మాయ చేస్తున్నారు. కాలానుగుణంగా మారుతున్న నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ఇష్టారాజ్యంగా లే అవుట్‌లు వేస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. స్థానిక సంస్థలను మభ్యపెడుతున్నారు. రిజర్వు స్థలాలను కేటాయించే క్రమంలో గోల్‌మాల్ చేస్తున్నారు. క్రాస్ ముక్కలను, ఇరిగేషన్ స్థలాలను రిజర్వు స్థలాలుగా చూపుతున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన అధికారులు కాసులకు కక్కుర్తి పడి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


మల్లాయిపాలెంలోని అనధికార లే అవుట్


టెలిఫోన్ నగర్‌లో రిజర్వు సైటుగా చూపిన ఇరిగేషన్ స్థలం

# రియల్ మాయ

- జిల్లాలో 70 శాతం అనధికార లే అవుట్‌లే!
- రిజర్వు సైట్లుగా మిగిలిన క్రాస్ ముక్కలు, ఇరిగేషన్ స్థలాలు
- కచ్చా డ్రెయిన్లు తీసి రోడ్లుగా చూపే ప్రయత్నం
- సీఆర్‌డీఏ, ముడా అనుమతులు లేకుండానే విక్రయాలు
- కాసుల మత్తులో జోగుతున్న రెవెన్యూ, పంచాయతీ అధికారులు
- పట్టించుకోని జిల్లా స్థాయి అధికారులు

**ఆంధ్రజ్యోతి - గుడివాడ:** జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, మండలాల్లో వందలాది లే అవుట్‌లు వెలిశాయి. వీటిలో 70 శాతానికిపైగా అనధికార లే అవుట్‌లని గతంలో అధికారులు ధ్రువీకరించారు. ఎకరం నుంచి పదుల సంఖ్యలో అనధికార లే అవుట్‌లను వేస్తున్నారు. ముఖ్యంగా పట్టణ శివారు ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో నాలా చెల్లించకుండా లే అవుట్‌లు వెలిసినా స్థానిక అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. జిల్లాలో సీఆర్‌డీఏ, ముడాల నుంచి అనుమతులు తీసుకునే క్రమంలో రహదారులు, డ్రెయిన్లు తదితర వసతులను కల్పిస్తామని అనుమతులు పొందుతున్నారు. క్షేత్రస్థాయిలో అధికారుల బృందం వచ్చినప్పుడు రియల్టర్లు మాయ చేస్తున్నారు. ఎక్కడా కూడా నిబంధనల మేరకు రోడ్లు ఏర్పాటు చేయలేదు. కచ్చా డ్రెయిన్లు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. స్థానిక సంస్థల్లో కొందరు అధికారులు కాసులకు కక్కుర్తిపడి లే అవుట్ ప్లాన్ అప్రూవల్ పత్రాలను కాల్చేసిన దాఖలాలు ఉన్నాయి. కొందరు ప్రభుత్వ నిబంధనలు తమకేమి పట్టవని లేఅవుట్‌లు వేస్తూనే ఉన్నారు. గుడివాడ డివిజన్‌లోని మల్లాయిపాలెం, నాగవరప్పాడు, చిన ఎరుకపాడులో అనధికార లే అవుట్‌లు వెలిశాయి.

### రిజర్వు స్థలాల గోల్‌మాల్!

లేఅవుట్ వేస్తే తప్పనిసరిగా స్థానిక సంస్థలకు 10శాతం మేర రిజర్వు స్థలాలను ఇవ్వాల్సి ఉంది. అసలు మాయ ఇక్కడే జరుగుతుంది. పెద్ద లే అవుట్‌లలో అమ్మకానికి పనికి రాని చిన్నచిన్న ముక్కలుగా మిగిలిన స్థలాలు, క్రాస్ ముక్కలను రిజర్వు స్థలాలుగా మ్యాప్‌లలో చూపుతున్నారు. దీనికి అనుమతులిచ్చే అధికారులు తలాడిస్తున్నారు. ఇచ్చిన రిజర్వు స్థలాలు స్థానిక సంస్థలకు ఏ విషయంలోనూ పనికిరావు. ఏ లే అవుట్‌లో కూడా ఒకే చోట రిజర్వు స్థలం మొత్తాన్ని చూపిన దాఖలాలు తక్కువ. ఒక్క ప్రభుత్వ లేఅవుట్‌లలో మాత్రమే రిజర్వు స్థలాన్ని ఒకే చోట చూపుతున్నారు. రిజర్వు స్థలాలు ఎక్కడ మిగతా 6లో..

# లాటరీలో ఒక బార్ ఎంపిక

- మిగిలిన 11 బార్‌లకు స్పందన కరువు
- లాటరీ తీసి అభ్యర్థిని ఖరారు చేసిన డీఆర్వో

**మచిలీపట్నంటౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో రెండో విడత నిర్వహించిన బార్‌ల కేటాయింపు లాటరీలో ఒక దానికి వ్యాపారిని అధికారులు ఖరారు చేశారు. డీఆర్‌వో కార్యాలయంలో గురువారం లాటరీ తీశారు. డీఆర్వో, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ కె.చంద్రశేఖరరావు లాటరీ ద్వారా వ్యాపారిని ఎంపిక చేశారు. జిల్లాలో మొత్తం 12 బార్లకు తొలివిడతలో ఎలాంటి దరఖాస్తులు రాలేదు. దీంతో రెండో విడతలో వీటికి ఎక్సైజ్ అధికారులు దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ నెల 17వ తేదీతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. ఒక బార్‌కు మాత్రమే నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చాయి. గుడివాడలోని బార్‌కు మనిముక్కు జలచంద్రుడు నాలుగు దరఖాస్తులు దాఖలు చేయగా, ఆయనకే బార్ లైసెన్సు దక్కింది. మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో నాలుగు, పెడన మునిసిపాలిటీలో ఒకటి, మంగినపూడి బీచ్‌లో ఒకటి, గుడివాడలో ఐదు బార్‌లకు దరఖాస్తులు రాకపోవడంతో వీటిని పక్కనపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.గంగాధరరావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ భార్గవ్ పాల్గొన్నారు.


డీఆర్వో కార్యాలయంలో బార్‌కు లాటరీ తీస్తున్న డీఆర్వో చంద్రశేఖర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గంగాధరరావు తదితరులు



## ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో అమరావతి

- సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు

## రెండు మండలాలను విజయవాడలో కలపాలి

- అసెంబ్లీలో ప్రభుత్వ విప్ యార్లగడ్డ

## బుడమేరు కట్ట అభివృద్ధి చేయాలి


- పెనమలూరు ఎమ్మెల్యే బోడె

8

# కామన్‌సైట్ అక్రమ రిజిస్ట్రేషన్

- గండిగుంటలో రూ.కోట్ల విలువైన 33 సెంట్లు విక్రయించిన లే అవుట్ నిర్వాహకులు
- 2008లో పంచాయతీకి ఇస్తున్నట్టు దాన పత్రం ఇచ్చినా రిజిస్ట్రేషన్ చేయించుకోని పంచాయతీ అధికారులు
- ఆలస్యంగా వెలుగుచూసిన వ్యవహారం
- తప్పుసరిదిద్దుకునే పనిలో పంచాయతీ అధికారులు

**ఉయ్యూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) :** గండిగుంట పంచాయతీ పరిధి కాటూరు రోడ్డులో ఓ అనధికార లే అవుట్‌లో కోట్లాది రూపాయల విలువ చేసే సుమారు 33 సెంట్ల కామన్ సైట్‌ను లే అవుట్ వేసిన వారు ఇటీవల ఓ వ్యక్తికి ఈ నెల 6న అక్రమంగా రిజిస్ట్రేషన్ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. గండిగుంటకు చెందిన ఆలూరు లత, వల్లభనేని రామారావుకు చెందిన 258/2, 259/1 సర్వే నంబర్లలోని 3.29 ఎకరాల వ్యవసాయ భూమిలో 2008లో లే అవుట్ వేశారు. 35 ప్లాట్లుగా విభజించి, అందులో 33 సెంట్ల భూమిని కామన్ సైట్‌గా చూపించి అన్ని ప్లాట్లు విక్రయించారు. కామన్ సైట్‌గా వదిలినభూమిని గ్రామ పంచాయతీకి ఇస్తున్నట్టు లేఅవుట్ వేసిన వారు దాన పత్రం రాసి ఇచ్చారు. అయితే అప్పటి నుంచి పంచాయతీ వారు దానిని రిజిస్ట్రేషన్ చేయించుకోకపోవడంతో లే అవుట్ నిర్వాహకులు కోట్ల రూపాయలు విలువ చేసే భూమిని రత్నా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ మేనేజింగ్ పార్టనర్ బోరుకాటి ప్రసాదరాజుకు విక్రయించి, సీఎస్ నంబరు 5146, 5051/2025తో ఉయ్యూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. విషయం తెలుసుకున్న గ్రామపంచాయతీ అధికారులు హడావిడిగా తప్పుసరిదిద్దుకునేందుకు అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి ఇరువర్గాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తున్నారు. కాగా, అనధికార లేఅవుట్లలో రిజిస్ట్రేషన్లు చేయరాదన్న ప్రభుత్వ నిబంధన ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయడంపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా సబ్‌రిజిస్ట్రార్ సెలవులో ఉన్నట్టు కార్యాలయ ఉద్యోగులు తెలిపారు. గండిగుంటలో మిగతా 6లో..


గండిగుంట గ్రామ పంచాయతీ పరిధి కాటూరు రోడ్డులో అనధికార లే అవుట్‌లో కామన్‌సైట్‌గా వదిలిన భూమి




# జగజ్జననీ..

(ఇంద్రకీలాద్రి, ఆంధ్రజ్యోతి)


బెజవాడ అంటే కనకదుర్గాదేవి, కృష్ణానది గుర్తుకువస్తాయి. భక్తులు కృష్ణానదిలో స్నానంచేసి కొండపైన అమ్మవారిని దర్శించుకుంటారు. దసరా మహోత్సవాలలో మూలానక్షత్రం అమ్మవారు పుట్టినరోజు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. దసరా మహోత్సవాలు నవరాత్రులకు బదులుగా ఈఏడాది 11రోజులు జరుగుతాయి. తిథులు హెచ్చు తగ్గుల కారణంగా ఒకరోజు అదనంగా జరుపుకోవాల్సి వస్తుంది.

### బాలాత్రిపుర సుందరీదేవి అలంకారం



దసరా మహోత్సవాలలో తొలి రోజు (22వ తేదీ) సోమవారం నాడు బాలా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తారు. సమస్త దేవీ మంత్రాల్లో బాలా త్రిపురసుందరీదేవి మంత్రం అత్యంత ప్రధానమైనదని, శక్తివంతమైనదని పేరు. మూడు లోకాలలోనూ అత్యంత అందమైన దేవతగా ఆమెను భావిస్తారు. దసరా మహోత్సవాలలో కన్నెపిల్లలను బాలాత్రిపుర సుందరిగా భావించి పూజలు చేస్తారు.

### గాయత్రీదేవి అలంకారం



23వ తేదీ మంగళవారం గాయత్రీదేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తారు. గాయత్రీదేవిని కొలవటం వల్ల సుఖశాంతులు లభిస్తాయని, మానసిక శాంతి కలుగుతుందని నమ్మిక. గాయత్రి మంత్ర జపంతో గుండె సంబంధిత వ్యాధులు తగ్గుముఖం పడతాయన్న శాస్త్ర పరిశోధనలున్నాయి. ముక్తా, విద్రుమ, హేమ, నీల, దవళం. సాంఖ్యాయనస గోత్ర గాయత్రిదేవి పిలవంగానే వరాలు ఇచ్చే దేవతగా నమ్ముతారు.

### అన్నపూర్ణాదేవి అలంకారం




24వ తేదీ బుధవారం అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ దర్శనమిస్తారు. కాశీపురాదీశ్వరి భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరి అంటే ఆమె ఈతి బాధలు లేకుండా అన్నపానాదులకు లోటులేకుండా చేస్తుందని నమ్మిక. ఆమెను శాంకరిగా, శంభుని ప్రియురాలిగా, కాశ్మీరవాసినిగా, కాశీనివాసిగా, త్రిపురేశ్వరిగా, త్రినయినిగా, విశ్వేశ్వరిగా కొలుస్తారు. అన్నపూర్ణ అంటే పూర్ణమైన ఆహారం కలది అని అర్థం.

### కాత్యాయనీ దేవి అలంకారం



25వ తేదీ గురువారం కాత్యాయనీదేవిగా దుర్గమ్మ దర్శనమిస్తారు. నవదుర్గలలో ఆరో అవతారం కాత్యాయనీ దేవి. రాక్షస సంహారం కోసం ఆమె కాత్యాయనీ రూపంలో ఉన్నారని ప్రతీతి. ముక్కోటి దేవతలు, త్రిమూర్తులు కాత్యాయనీదేవికి సహకరిస్తారు. అత్యంత ఉగ్రరూపాల్లో ఆమె ఒకరు. దసరా మహోత్సవాలలో ఈఏడాది అదనంగా ఒకరోజు రావటంతో కాత్యాయనీ అలంకారంలో దుర్గమ్మ దర్శనం ఇస్తారు.

### మహాలక్ష్మీదేవి అలంకారం




26వ తేదీ శుక్రవారం మహాలక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తారు. అష్టలక్ష్మి రూపాల్లో ఆమె పూజలు అందుకుంటుంది. మహాలక్ష్మీదేవి ధనానికి ఐశ్వర్యానికి అధిదేవత. మహావిష్ణువుకు అత్యంత ప్రీతికరమైన పత్నిగా ఆమె విష్ణువుతో పాటు భూలోకానికి వచ్చి కొలువై ఉన్నారని నమ్మిక. ధనం, ధాన్యం, ధైర్యం వంటివి కలగటానికి ఆమెను అమృతస్వరూపిణిగా కొలుస్తారు.

### లలితా త్రిపుర సుందరీదేవి అలంకారం




27వ తేదీ శనివారం లలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మభక్తులకు దర్శనమిస్తారు. లలితా త్రిపుర సుందరీ శక్తి స్వరూపాలలో ముఖ్యమైన దేవత. ఆమె ఆదిపరాశక్తి స్వరూపం. దసరా ఉత్సవాలలో లలితా సహస్రనామ పారాయణ చేస్తారు. పరమేశ్వరుడు మహాకామేశ్వరుడుగా అమ్మవారు మహాత్రిపుర సుందరిగా ఈ అలంకారంలో కనిపించటం విశేషం.

### మహాచండీదేవి అలంకారం



28వ తేదీ ఆదివారంనాడు మహాచండీదేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తారు. చండీదేవిని కొలిస్తే సర్వదేవతలను ప్రార్థించినట్లేనని పండితులు చెబుతారు. దుష్టులను సంహరించి శిష్ట రక్షణ చేయటమే అవతారానికి ప్రసిద్ధి. దుర్గగుడిలో నిత్యం చండీహోమం ద్వారా భక్తులు అమ్మవారిని కొలిచి సంతుష్టులు అవుతారు. చండీహోమానికి ప్రథమ ప్రాధాన్యత ఉంది.

### సరస్వతీదేవి అలంకారం



29వ తేదీ సోమవారం మూలా నక్షత్రంనాడు మహాసరస్వతీ దేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తారు. సరస్వతీ దేవి అలంకారానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. మూలనక్షత్రం నాడు అమ్మవారిని విశిష్టంగా కొలుస్తారు. ఆమెను కొలిచిన వారికి ఈతి బాధలు ఉండవని నమ్మిక. విద్య ఉన్నవాడు లోకంలో ఎక్కడైనా బ్రతకగలడని నమ్మిక. సరస్వతీదేవిని కొలిస్తే విద్య అపారంగా కలుగుతుందని నమ్మిక. మూలా నక్షత్రం నాడు సరస్వతిదేవిగా, వాగ్దేవతా మూర్తిగా విద్యార్థులు ఆమెను అత్యంత భక్తితో కొలుస్తుంటారు.

### దుర్గాదేవి అలంకారం..




30వ తేదీ మంగళవారం నిజరూపం దుర్గాదేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తారు. చెడుపై విజయాన్ని సాధించినందుకు గుర్తుగా దుర్గాదేవిని కొలుస్తారు. దుర్గమాసురుడిని సంహరించటంతో ఆమెను దుర్గగా పూజలు అందుకుంటున్నారు. దుర్గ అంటే దుర్గతులు అన్నీ నాశనమవుతాయని నమ్మిక. తమ ఇంటి ఆడపడుచుగా భావించి పూజాదికాలు చేస్తారు. సమస్త దేవతా స్వరూపిణిగా దుర్గమ్మవారు ఇంద్రకీలాద్రిపై కొలువై ఉండటం ప్రాధాన్యతను సంతరించుకుంది.

### మహిషాసుర మర్దినీదేవి అలంకారం



అక్టోబరు 1వ తేదీ బుధవారంనాడు దుర్గాదేవి మహిషాసుర మర్దినీదేవిగా భక్తులకు దర్శనం ఇస్తారు. అత్యంత శక్తివంతమైన ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకోవటం వలన ఈతి బాధలు ఉండవని నమ్మిక. ఈరోజునే ఆయుధ పూజ చేస్తారు. చివరి మూడురోజులు అమ్మవారిని పూజించటం వల్ల సర్వ శుభాలు కలుగుతాయని నమ్మిక.

### రాజరాజేశ్వరి దేవి అలంకారం



దసరా మహోత్సవాలలో చివరి రోజైన 11వ రోజు 2వ తేదీ గురువారంనాడు దుర్గమ్మ రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనం ఇస్తారు. అమ్మవారిని శాంతమూర్తిగా దర్శించుకుంటారు. జగన్మోహిని, మోక్షప్రదాయిని, శ్రీరాజరాజేశ్వరిదేవిని కొలవటం వల్ల సకల శుభాలు కలుగుతాయని నమ్మిక. చివరి రోజున అమ్మవారు హంస వాహనంపై కృష్ణానదిలో నదీ విహారం చేస్తారు. ఈ సమయంలో ముక్కోటి దేవతలు ఆమెకు జయజయధ్వానాలు పలుకుతారని నమ్మిక.



భూమిపూజ చేసి ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటును ప్రారంభిస్తున్న కూటమి నేతలు

## అట్టహాసంగా విజయవాడ ఉత్సవ్ ఏర్పాట్లు

» గొల్లపూడిలో ఎగ్జిబిషన్‌కి భూమిపూజ


**ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) :** విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో గొల్లపూడిలోని వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్ స్టాల్స్‌కు కూటమి నేతలు గురువారం సాయంత్రం భూమిపూజ చేసి ప్రారంభించారు. విఘ్నాలు తొలగి కార్యక్రమం విజయవంతం చేయాలని అమ్మవారిని వేడుకున్నారు. పుష్కర కాలం తర్వాత ఎంపీ కేశినేని శివనాథ్ చొరవతో ఎగ్జిబిషన్ మొదలు కావడం ఎంతో ఆనందంగా ఉందని కూటమి నేతలు అన్నారు. కార్యక్రమంలో ఏపీ బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్ అడ్వజరీ కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, బొమ్మసాని సుబ్బారావు, నూతులపాటి బాలకోటేశ్వరరావు, అక్కల గాంధీ, శ్రేయాస్ డైరెక్టర్ శ్రీనివాస్, నారద, గోపాలకృష్ణ, కాటంనేని చలపతి, కోటేశ్వరరావు, పద్మశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ చిట్టిబాబు

## పవిత్రసంగమంలో సాంస్కృతిక శోభ

'విజయనర్తనం - కొండపల్లి మున్సిపాలిటీ' నినాదంతో కొండపల్లిలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2వరకు ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మున్సిపల్ ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ప్రతిరోజుమూడు కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సమావేశంలో కౌన్సిలర్స్ చనమోలు నారాయణ, పీఏసీఎస్ ఛైర్మన్ కోయ నెహ్రూ, చెరుకుమల్లి సురుష్, పులి దాసు, వల్లూరు జనార్దన స్వామి, ఇన్‌చార్జి కమిషనర్ మోస్మి గనియా తదితరులు పాల్గొన్నారు.



గొల్లపూడిలో ఎగ్జిబిషన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వసంత

## అభివృద్ధిని అడ్డుకోవడమే జగన్ పని

» ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఎద్దేవా

**ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) :** విజయవాడకు చెడ్డ పేరు తేవాలి, నగరంలో ఎలాంటి అభివృద్ధి జరగకూడదనేదే మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని, అందులో భాగంగానే దేవస్థానం భూమిపై రైతులు పెట్టినట్టు తప్పుడు సంతకాలు పెట్టించి కోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చాడని, అమ్మ దయవల్ల కోర్టు స్టే ఎత్తివేసిందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా గొల్లపూడిలో దేవస్థానం భూమిలో జరుగుతున్న ఎగ్జిబిషన్ ఏర్పాటు పనుల్ని ఆయన గురువారం ఆర్‌అండ్‌బీ, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వైసీపీ ఐదేళ్ల పాలనలో విజయవాడలో ఒక్కటంటే ఒక్క ఈవెంట్ కూడా నిర్వహించలేదని, ఇప్పుడు ఆ భావనను తొలగించి ఎగ్జిబిషన్ నిర్వహిస్తుంటే దానిని కూడా ఆపాలని చూశారన్నారు. విజయవాడలో స్థలం లేదు కనుకనే గొల్లపూడికి రావాల్సి వచ్చిందన్నారు. ఆటంకాలను అధిగమించి సకాలంలో పనులు పూర్తి చేస్తాం.. అమరావతి సమగ్రంగా అభివృద్ధి చెందేందుకు ఇది ఊతమిచ్చే కార్యక్రమం అన్నారు. రాజకీయ, సినీ ప్రముఖులు వచ్చేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఖచ్చితంగా విజయవాడ బ్రాండ్ ఇమేజ్ పెరుగుతుంది. వచ్చే ఏడాది రెట్టించిన ఉత్సాహంతో చేస్తాం అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, ఏఎంసీ ఛైర్మన్ నర్రా వాసు, గ్రామ అధ్యక్షుడు నూతులపాటి వెంకటేశ్వరరావు (నారద), ఆలూరి హరికృష్ణ చౌదరి (చిన్న), విద్యుత్‌శాఖ ఎస్ఈ అన్నమయ్య, డీఈ రవీంద్రబాబు, ఏడీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాలు విజయవంతం చేద్దాం

» శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్ బాబు

**వన్‌టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) :** పర్వదినాలు మతసామరస్యానికి ప్రతీకలని, ఐక్యత, సోదరభావంతో దసరా ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన శాంతి కమిటీ (పీస్ కమిటీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా శాంతి, సౌభ్రాతృత్వంతో ప్రతి పండగనూ జరుపుకుంటున్నామని, ఇదే స్ఫూర్తితో దసరా ఉత్సవాల విజయవంతానికి చేయిచేయి కలుపుదామని, జిల్లాను ఆదర్శవంతంగా నిలబెడదామని



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబు

పేర్కొన్నారు. ఈసారి దసరా ఉత్సవాలకు 15 లక్షల మందికిపైగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే అవకాశముందని తెలిపారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పటిష్ఠ ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తిచేసే వారిపై నిఘా ఉంటుందని పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రత, పార్కింగ్ సదుపాయాలు, సీసీటీవీలు, డ్రోన్లతో నిఘా.. ఇలా ప్రతివిషయంలోనూ ప్రత్యేక జాగ్రత్తలతో చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. విజయవాడ శాంతియుత వాతావరణానికి ప్రతీక అని, దసరా ఉత్సవాలను విజయవంతం చేయడంలో కీలక భాగస్వాములమవుతామని వివిధ మతాల పెద్దలు పేర్కొన్నారు. తమనుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. సమావేశంలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, డీసీపీ కేజీవీ సరిత, ఎండోమెంట్ ఏసీ ఎన్.షణ్ముగం, డీఎండబ్ల్యూ అబ్దుల్ రబ్బానీ, వివిధ మతాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



దసరా ఉత్సవాల సందర్భంగా అన్నదాన భవనం, లడ్డూ పోటు పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్, అధికారులు

## వంటశాల ఏర్పాట్ల పరిశీలన..

**ఇంద్రకీలాద్రి :** భక్తుల సౌకర్యార్థం ఇంద్రకీలాద్రి దిగువన నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన భవనం, లడ్డు పోటులో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. దసరా ఉత్సవాలలో అన్నప్రసాద తయారీ కేంద్రం సిద్ధమవుతోంది. వాటర్ ట్యాప్‌లు, క్యూలు, వంటచేసే ప్రాంతం, బఫే విధానంలో భోజనం చేసేందుకు మార్కింగ్ తదితర అంశాలపై ఈవో శీనానాయక్ గురువారం దిశా నిర్దేశం చేశారు. వీరివెంట అన్నదానం ఏఈవో వెంకటరెడ్డి పెనుగంచిప్రోలు ఈఈ ఎల్.రమ ఉన్నారు. భక్తుల సౌలభ్యం కోసం ఉచితంగా అల్పాహారం, అన్న ప్రసాదం, ఉచిత ప్రసాదాలు, మూలా నక్షత్రం, విజయదశమి రోజుల్లో చిన్న లడ్డు పంపిణీకి అన్నిఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. భక్తులకు పంపిణీ చేయడానికి మంచి నీటి బాటిళ్లను సిద్ధం చేశారు.

## రియల్ మాయ

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయో సరైన రికార్డులు స్థానిక సంస్థల వద్ద లేవంటే అధికారులు పనితీరుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

**ఇరిగేషన్ స్థలాన్ని రిజర్వు స్థలంగా చూపి..**

నందివాడ మండలం టెలిఫోన్ నగర్‌లోని ఒక లేఅవుట్‌లో ఏకంగా ఇరిగేషన్ స్థలాన్ని రిజర్వు స్థలంగా చూపి అనుమతులు పొంది ప్లాట్లను అమ్మేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తే సదరు స్థలం ఇరిగేషన్ పోరంబోకు స్థలంగా నమోదై ఉంది. తమకు తెలియకుండా తమ శాఖకు సంబంధించిన స్థలాన్ని ఎలా రిజర్వు స్థలంగా చూపారంటూ ఇరిగేషన్ శాఖ చర్యలకు సిద్ధమైంది. అనుమతులిచ్చే క్రమంలో పేర్కొన్న సర్వే నెంబరులో ఇరిగేషన్ పోరంబోకు స్థలంగా ఉంటే రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఎలా

నాగవరప్పాడులోని అనధికార లేఅవుట్



అనుమతులిచ్చారంటూ నిలదీస్తున్నారు. తీగలాగితే డొంక కదిలిన చందాన ఇదే తరహాలో పలు లేఅవుట్‌లలో మోసాలు జరిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. వీటిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

**అధికారుల కాసుల కక్కుర్తి..**

అనధికార లేఅవుట్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా అధికారుల్లో చలనం రావడంలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సీఆర్‌డీఏ, ముడా పరిధిలోకి రావడంతో అనుమతులు పొందడం పెద్ద ప్రహసనంగా మారుతుందనే ఆలోచనతో కొందరు అవినీతి అధికారుల అండతో అనధికార లేఅవుట్‌లకు తెరలేపుతున్నారు. రెవెన్యూ అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో



చిన ఎరుకపాడులోని అనధికార లేఅవుట్

జోగుతున్నారు. కావాలనే కాలయాపన చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా అనధికార లేఅవుట్‌లని బోర్డులు పెట్టిన దాఖలాలు లేవు. వాటిపై చర్యలు తీసుకున్న సందర్భాలు లేవు.

**అధికారుల నిర్లక్ష్యం**

అనధికార లేఅవుట్‌ల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలంటే నాలా పన్ను తప్పనిసరి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అనధికార లేఅవుట్‌లు వెలిశాయి. స్థానిక సంస్థలకు రావాల్సిన లక్షలాది రూపాయలకు గండిపడుతోంది. దీనిపై స్థానిక సంస్థలు నిలదీయడం లేదు. మరికొన్ని చోట్ల రిజర్వు సైట్‌లను చూపకుండా ప్లాట్‌లను అమ్మేస్తున్నారు. మరికొన్ని చోట్ల రిజర్వు సైట్లు ఇచ్చిన ప్లాట్‌ల అమ్మకాలు ముగిసిన వెంటనే సదరు రిజర్వు స్థలాలను అమ్ముకుంటున్నారు.

**బోర్డులు ఏర్పాటు చేస్తే పీకేస్తున్నారు..**

మున్సిపాల్టీల పరిధిలో గతంలో ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహించి అనధికార లే అవుట్‌లను గుర్తించి బోర్డులను ఏర్పాటు చేశారు. రెండు రోజులు గడవకముందే వాటిని రియల్టర్లు పీకేశారు. డోజర్లతో గుంతలు తవ్వేశారు. అనధికార లే అవుట్‌లల్లో ప్లాట్‌లను కొనవద్దని, ఎవరైన కొనుగోలు చేస్తే స్థానిక సంస్థల నుంచి ఎటువంటి అనుమతులు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ దృష్టి సారించి అనధికార లేఅవుట్‌లపై చర్యలు తీసుకుంటే స్థానిక సంస్థలకు లక్షలాది రూపాయల ఆదాయంతో పాటు రిజర్వు స్థలాలు కూడా దక్కుతాయి.

## పర్యాటకం భ్రమే!

(5వ పేజీ తరువాయి)

పంచేందుకు స్టార్ హోటల్స్ యజమానులు మంగినపూడి బీచ్ సమీపంలో త్రీస్టార్, ఫైవ్‌స్టార్ హోటల్స్ నిర్మాణం చేస్తామనే ప్రతిపాదనలతో ముందుకు వచ్చారు. తమకు భూములు కేటాయిస్తే రూ.150 కోట్ల పెట్టుబడితో ఇక్కడ స్టార్ హోటల్స్ నిర్మిస్తామని ప్రతిపాదనలు కూడా పెట్టారు. వన్‌స్టార్, ఒబెరాయ్ వంటి సంస్థలు ముందుకు వచ్చి 100 ఎకరాల భూమిని కేటాయించాలని కోరాయి. ఈ ప్రతిపాదనలపై రెవెన్యూ, పర్యాటక శాఖ అధికారులు పలుమార్లు కలెక్టర్‌తో సమావేశాలు కూడా నిర్వహించారు. మంగినపూడి బీచ్ ఎదురుగా 80 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి ఉంది. 20 సంవత్సరాల క్రితం రీసార్ట్‌ల నిర్మాణానికి ఈ భూమిని కేటాయించారు. భూమిని తీసుకున్న రీసార్ట్‌ల నిర్వాహకులు పెద్ద ఎత్తున భవనాలు నిర్మించి పర్యాటకులకు సౌకర్యాలు కల్పించాల్సి ఉండగా, నామమాత్రంగా రెండు, మూడు భవనాలు నిర్మించి మమ అనిపించారు. ఈ రీసార్ట్‌ల్లో పర్యాటకులను ఆకర్షించే విధంగా సౌకర్యాలు లేకపోగా, వేరే కార్యకలాపాలకు ఆవాసంగా మారాయి. దీంతో అటు వైపునకు వెళ్లాలంటేనే పర్యాటకులు జంకుతున్నారు. దీంతో ఈ రీసార్ట్‌లు నామమాత్రంగానే ఉండి పోయాయి. ఏడాదిన్నర క్రితం ఒబెరాయ్, వన్‌స్టార్ వంటి సంస్థల ప్రతిపాదనలను దృష్టిలో పెట్టుకుని బీచ్ ఎదురుగా ఉన్న 80 ఎకరాలతో పాటు సత్రవపాలెంలోని ప్రభుత్వ భూములను అధికారులు సర్వే చేయించారు. ఇక్కడ హోటల్స్ నిర్మాణానికి భూములు కేటాయించే ప్రతిపాదనలు తయారు చేసినా, ప్రభుత్వ ఆమోదం కోసం పంపకుండా జాప్యం చేస్తున్నారు. ప్రభుత్వానికి ఈ ప్రతిపాదనలు పంపితే, కేబినెట్ సబ్ కమిటీ పరిశీలించిన అనంతరం కేబినెట్ సమావేశంలో భూముల కేటాయింపునకు ఆమోదం తెలపాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది.



కేయూ వీసీ కూన రాంజీకి వినతిపత్రం ఇస్తున్న ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాల్స్

## సమస్యలు పరిష్కరించండి

» కేయు ఉపకులపతికి ప్రైవేట్ యాజమాన్యాల వినతి

**మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) :** ప్రైవేట్ కళాశాలల సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 22 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కూన రాంజీకి గురువారం ప్రైవేట్ కళాశాలల సంఘ అధ్యక్షుడు గోపు చక్రధర్ నోటీసు అందజేశారు. గురువారం విశ్వవిద్యాలయంలో వీసీ కూన రాంజీని కలసి పలు సమస్యలపై చర్చించారు. అఫిలియేషన్ ఫీజు చెల్లించేందుకు గడువు పెంచాలని, ప్రొసెసింగ్ ఫీజును మాఫీ చేయాలని కోరారు. విద్యార్థుల దామాషాను బట్టి ఫీజులు వసూలు చేయడం సముచితమన్నారు. మూడేళ్ళుగా కళాశాలలకు, విద్యార్థులకు చెల్లించవలసిన ఫీజు రీయంబర్స్‌మెంట్ జమ చేయాలని కోరారు.



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

## ఎడ్లంక దీవి కోత సమస్య పరిష్కరించండి

» తహసీల్దార్‌కు టీడీపీ నేతల వినతి

**అవనిగడ్డ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) :** కృష్ణానది వరదల కారణంగా కోతకు గురవుతున్న పాత ఎడ్లంక దీవి సమస్యకు వెంటనే చర్యలు తీసుకోవాలని సీనియర్ నేత బొబ్బా గోవర్ధన్ నేతృత్వంలో తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు. గురువారం అవనిగడ్డ తహసీల్దార్‌ను కలిసి నది కోత కారణంగా ఎడ్లంక గ్రామప్రజల ఉనికి ప్రశ్నార్థకంగా మారిందనీ, వారి వసతి ఉపాధి మొత్తం దీవి మనుగడపై ఆధారపడి ఉందన్నారు. గ్రామం కోతకు గురికాకుండా పెద్దఇసుక మేటలను సరిచేయించాలని, రాళ్ల మొండిలు నిర్మించాలని సూచించారు. గ్రామసభ ఏర్పాటుచేయాలని పార్టీ ప్రతినిధులు సూచించగా శనివారం గ్రామసభ నిర్వహించేందుకు తహసీల్దార్ ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.


## బావ మృతిని జీర్ణించుకోలేక ..

### ప్రాణాలు విడిచిన బావమరిది!

» ఒకే రోజు ఇరువురి మృతితో గ్రామంలో విషాదఛాయలు



ఆకుల గోపాలరావు



వేణుగోపాలరావు

**గుణదల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) :** వారిద్దరూ బావ, బావమరుదులు. వారిమధ్య అనుబంధాలు ఎంతగా పెనవేసుకున్నాయంటే.. బావ మృతిని జీర్ణించుకోలేక బావమరిది గంటల వ్యవధిలోనే తనువు చాలించాడు. ఈ ఘటన గుణదల ఊర్మిళానగర్లో ఆ ఇంట విషాదం నింపింది. వివరాలలోకి వెళితే.. కొద్దికాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న ఆకుల గోపాలరావు(65) ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం ఉదయం మృతిచెందాడు. మృతదేహాన్ని ఇంటికి తెచ్చారు. బావ ఇంటికి చెంతనే నివాసం ఉంటున్న బావమరిది ఉప్పులూరి వేణుగోపాలరావు(54) విషయం తెలుసుకుని బావ మృతదేహానికి పూలదండ వేసి నివాళులు అర్పించాడు. దుఃఖాన్ని తట్టుకోలేక పక్కనే ఉన్న కుర్చీలో కుప్పకూలిపోయాడు. వేణుగోపాలరావును ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. ఒకే రోజు ఇరువురు మరణించడంతో ఊర్మిళానగర్లో విషాదఛాయలు అలముకున్నాయి.

## కామన్‌సైట్ అక్రమ రిజిస్ట్రేషన్

(5వ పేజీ తరువాయి)

పంచాయతీకి చెందిన కోట్ల రూపాయలు విలువ చేసే భూమి అన్యాక్రాంతం అవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**అధికారులకు నివేదించాం**

కుమార్, గండిగుంట గ్రామపంచాయతీ సెక్రటరీ

గ్రామ పంచాయతీకి చెందిన సుమారు 33 సెంట్ల కామన్ సైట్ అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి, ఇరువర్గాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా రిజిస్ట్రార్, ఏపీసీఆర్డీఏ, ఆర్డీవోకు నివేదిక అందచేశాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
| --- | --- |
| బ్రాయిలర్ బర్డ్ | 133, 142, 153 |
| చికెన్ విత్ స్కిన్ | 254 |
| చికెన్ స్కిన్‌లెస్ | 264 |



**నెక్ కోడిగుడ్డు ధర (100)**
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

## మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ 16 ప్రైవేట్ ఆర్వో ప్లాంట్ల తనిఖీ

**కానూరు, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి) :** పలు ప్రాంతాల్లో తాగునీరు కలుషితమై అనారోగ్య పరిస్థితులు తలెత్తున్న నేపథ్యంలో తాడిగడప మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ గురువారం కానూరులోని ప్రైవేట్ ఆర్వో ప్లాంట్‌లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆర్వో ప్లాంట్‌లలో నీటి సాంద్రత పరిశీలించేందుకు తాగునీటి నమూనాలు సేకరించారు. కానూరులోని సనత్‌నగర్, పంటకాలువరోడ్డు, మురళీనగర్ తదితర ప్రాంతాల్లో ఉన్న 16 ఆర్వో ప్లాంట్‌లను తనిఖీ చేశారు. కమిషనర్ షేక్ నజీర్ మాట్లాడుతూ తనిఖీలు నిర్వహించిన ఏ ఆర్వో ప్లాంట్‌కు కూడా ఎటువంటి అనుమతులు లేవని, ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు దీనిపై లేఖరాస్తున్నామన్నారు. నీరు కూడా సరిగా శుద్ధి చేయడం లేదన్నారు. తనిఖీల్లో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కిరణ్, శానిటరీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

## రక్తదానానానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలి

**ఉంగుటూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) :** రక్తదానం ప్రాణదానంతో సమానమని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేవీ ఎవీ ప్రసాద్ అన్నారు. విజయవాడ అమెరికన్ బ్లడ్ క్యాన్సర్ కేర్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రిన్సిపాల్ ప్రసాద్ ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడే ఇలాంటి సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు నిరంతరం భాగస్వాములు కావాలని సూచించారు. ఈ శిబిరంలో 106 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. వైద్యాధికారి డాక్టర్ మురళీ మోహన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.శ్రీహరి బాబు, ఆస్పత్రి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


డ్వాక్రా మహిళలకు చెక్కును అందజేస్తున్న జోనల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ టి.బాలు

## రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

**గన్నవరం:** రుణాలు పొందిన డ్వాక్రా మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని యూకో బ్యాంకు జోనల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ టి.బాలు అన్నారు. సూరంపల్లి యూకో బ్యాంకులో డ్వాక్రా మహిళలకు గురువారం రూ. 2.52 కోట్లు రుణాలను అందజేశారు. చీఫ్ మేనేజర్ బాలు మాట్లాడుతూ ఇప్పటికే బ్యాంకు నుంచి రూ3.27 కోట్లు రుణాలు మొదటి దఫా ఇచ్చినట్లు తెలిపారు. డ్వాక్రా మహిళలు ఆర్థిక స్వావలంబ న సాధించాలన్నారు. రుణాలు తీసుకున్న ప్రతి ఒక్కరు సక్రమంగా చెల్లించాలన్నారు. ఎస్ఎంఈ అండ్ అగ్రి హబ్ హెడ్ చీఫ్ మేనేజర్ పెదుమజ్జి జగదీష్, షేక్ ఖాదర్ బాబా, ఫీల్డ్ ఆఫీసర్ తేజశ్విని, బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.


సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌లు

## వికాస్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో అంతర్జాతీయ సదస్సు నేడు, రేపు

**విజయవాడ రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) :** నున్నలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ఈనెల 19, 20 తేదీల్లో (శుక్ర, శనివారం) ఇంజనీరింగ్ ఫార్మసీ అండ్ లైఫ్ సైన్సెస్ అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ నరెడ్ల సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ పీఎస్ శ్రీనివాస్ తెలిపారు. సదస్సు బ్రోచర్‌ను గురువారం కళాశాలలో ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగాను, అమెరికాకు చెందిన విద్యార్థులు, అధ్యాపకుల నుంచి 328 పరిశోధన పత్రాలు వచ్చాయని వివరించారు. విద్యార్థులు, అధ్యాపకులు సమర్పించిన అన్ని పత్రాలను పరిశీలించి క్యాపస్, బెంథమ్ సైన్స్, వెబ్ ఆఫ్ సైన్స్‌లలో ప్రచురించనున్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ వీఎల్ఎన్ పణి, సహ కన్వీనర్లు టి.కిషోర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఎంపీ బాలశౌరి జన్మదిన వేడుకను నిర్వహిస్తున్న జనసేన నాయకులు

## ఘనంగా బాలశౌరి జన్మదిన వేడుక

**హనుమాన్‌జంక్షన్:** ఎంపీ బాలశౌరి జన్మదిన వేడుకను స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానం వద్ద గురువారం జనసేన నియోకవర్గం సమన్వయ కర్త చలమలశెట్టి రమేష్ బాబు నిర్వహించారు. దేవస్థానంలో ఎంపీ బాలశౌరి పేరిట పూజలు జరిపారు. ఆలయం ఎదుట కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జనసేన మండల అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, ఆలయపాలక మండలి చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు, జనసేన కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ఛీటింగ్ కేసులో నిందితుడికి ఏడాది జైలు

**విజయవాడ లీగల్ :** చీటింగ్ కేసులో నేరం రుజువుకావడంతో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ నాలుగో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ యు.రామ్మోహన్ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం పటమట పోలీసు స్టేషన్ పరిధిలోని సుస్వదీప్ ఆగ్రో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పోరంకికి చెందిన మల్లెపూడి గోపి పనిచేస్తున్నాడు. ఇతడు సేల్స్ టీమ్ లీడర్‌గా పనిచేసేవాడు. కంపెనీ ఉత్పత్తులన షాపులకిచ్చి వారి వద్ద నగదు తీసుకొని వచ్చి కంపెనీకి కట్టేవాడు. గోపి 2016 నుంచి షాపులవారు ఇచ్చిన డబ్బును జల్సాలకు వాడుకొని కంపెనీకి కట్టకపోవడంతో నిర్వాహకులు పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, గోపీపై నేరం రుజువు కావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

# వీఆర్ఏల న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలి

• బొడ్డు వెంకటరత్నం


ఉంగుటూరులో..

**గన్నవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని వీఆర్ఏల సంఘం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటరత్నం డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గన్నవరం తహసీల్దారు కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. వెంకటరత్నం మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో వీఆర్ఏల కుటుంబాలు అవస్థలు పడుతున్నాయన్నారు. సంఘం మండల అధ్యక్షుడు మిరంపల్లి పూర్ణచంద్రరావు, కార్యదర్శి జి.రామకృష్ణ, కోశాధికారి డి.అనూష, సుజాత, గీత, స్వర్ణ, ఝాన్సీ, సువర్ణ, జ్యోతి, జోస్పిన్, లక్ష్మీ, పద్మారావు, సుబ్బారావు, షెహనాజ్ తదితరులు పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్ :** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం వీఆర్ఏలు బాపులపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తమ విధులను బహిష్కరించి నిరసనలో పాల్గొన్నారు. సంఘం మండల నాయకులు వెంకటరత్నం, శిలారపు ఐజాక్, సీహెచ్..మోహన్‌రావు తదితరులు నాయకత్వం వహించారు. **ఉంగుటూరు :** సమస్యలు పరిష్కరించాలంటూ వీఆర్ఏలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పే స్కేలు అమలుచేయాలని, అర్హులైన ప్రతి వీఆర్ఏకు వీఆర్వోగా పదోన్నతి కల్పించాలని, నామినీలను క్రమబద్ధీకరించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ జాలాది విమలకుమారికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు చిలకా వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బొకినాల ప్రశాంత్, కార్యదర్శి మిరియాల రాజేష్, సహాయకార్యదర్శి బొకినాల ఝాన్సీ, తదితర నాయకులు పాల్గొన్నారు.



బాపులపాడులో..


గన్నవరంలో..

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే జైలుకే

• సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్

**గుణదల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) :** పాఠశాలల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే మాత్రం జైలుకే అని సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ హెచ్చరించారు. రామవరప్పాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థి ఈనెల 6వ తేదీ నుంచి పాఠశాలకు వెళ్లకుపోగా రామవరప్పాడులోని యువకుడితో కలిసి సిగరెట్లు తాగడం, మద్యం తాగుతూ చెడుమార్గంలో పయనించడంతో తల్లి పటమట పోలీసులను ఆశ్రయించింది. పటమట సీఐ పవన్ కిషోర్ బాలుడి ఫొటోలను పోలీసు శాఖకు పంపగా, ఏలూరు వట్లూరి గేటు వద్ద రోడ్డుపక్కన పడి ఉన్న బాలుడిని అక్కడి పోలీసులు గుర్తించి పటమట పోలీసులకు సమాచారం అందించారు. పటమట పోలీసులు బాలుడిని తీసుకొచ్చి ఆసుపత్రిలో చేర్పించారు. బాలుడిని బ్లేడుతో తీవ్రంగా గాయపరిచిన యువకుడి కోసం పోలీసులు గాలించి ఎట్టకేలకే అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరూ బైక్‌పై ఏలూరు వెళ్లి మద్యం తాగాక వాగ్వాదం జరగడంతో బాలుడిని గాయపరచి పరారయ్యానని యువకుడు చెప్పాడు. మరోటీమ్ రామవరప్పాడు రాజుల బజార్లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కూడా విచారించారు. పాఠశాలలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని తేలడంతో ఏసీపీ దామోదర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తాయారుతో మాట్లాడారు. చెడు వ్యసనాలకు అలవాటుపడ్డ వారిని గుర్తించి అటువంటి వారికి తల్లిదండ్రుల సమక్షంలోనే కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. మార్పురాని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఇటువంటి వారు పాఠశాలలో ఉండటం వల్ల మిగిలిన పిల్లల భవిష్యత్ దెబ్బతినే అవకాశం ఉంటుందని పటమట సీఐ పవన్ కిషోర్ అన్నారు.


హెచ్ఎం తాయారుతో మాట్లాడుతున్న ఏసీపీ దామోదర్


ఎ.సీతారాంపురంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి

## పోషకాహారంపై అవగాహన కలిగి ఉండాలి

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):** పోషకాహారంపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, కౌమారదశలోని బాలికలు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం తప్పనిసరి అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి సూచించారు. వీరవల్లి, ఎ.సీతారాంపురంలో గురువారం ఊబకాయం, ఫాస్ట్‌ఫుడ్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఊబకాయం వల్ల మధుమేహం, థైరాయిడ్ లాంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే ప్రమాదముందన్నారు. భానుమతి, రమాదేవి, నాగమణి, రాజి తదితర అంగన్‌వాడీ వర్కర్లు, ఆశావర్కర్లు చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## 150 మందికి వైద్య పరీక్షలు

**హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** నూజివీడు రైల్వే స్టేషన్ సమీపంలోని ఎఫ్‌సీఐ గిడ్డంగి వద్ద మెడ్‌వ్యాలీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమేష్ చక్రవర్తి పంచకర్ల ఆధ్వర్యంలో మెడ్‌వ్యాలీ హాస్పిటల్ వైద్యులు సుధ, స్పందన 150 మందికి నేత్ర, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. భారత ఆహార సంస్థ హనుమాన్‌జంక్షన్ గిడ్డంగి చీఫ్ మేనేజర్ డాక్టర్ మల్లికార్జునరావు, ఎఫ్‌సీఐ మేనేజర్ శ్యాం ప్రసాద్, క్లబ్ నాయకులు నందిగం స్వామి, అక్కినేని రాఘవేంద్రరావు, మాకినేని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



జంక్షన్ ఎఫ్‌సీఐలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు


ఆర్థిక సాయం అందజేస్తున్న బోడె వెంకట్రామ్

## టీడీపీ కార్యకర్తకు బోడె వెంకట్రామ్ ఆర్థిక సాయం

**కంకిపాడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) :** టీడీపీ కార్యకర్తలకు బోడె కుటుంబం అన్ని వేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కుమారుడు బోడె వెంకట్రామ్ అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు శివారు కొణతనపాడు గ్రామానికి చెందిన మోటుపల్లి యశ్వంత్‌కు గురువారం ఆయన ఆర్థిక సాయం అందచేశారు. ప్రొద్దుటూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు ఈడా కోటేశ్వరరావు, నాని పాల్గొన్నారు.

## అసైన్డ్ భూ బాధితుల ఆందోళనకు ఎస్ఎఫ్ఐ సంఘీభావం


భూబాధితులతో మాట్లాడుతున్న సమరం

**ఉంగుటూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) :** ఎలుకపాడు అసైన్డ్ భూబాధితుల సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఎస్ఎఫ్ఐ అండగా వుంటుందని జిల్లా ప్రధాన కార్యదర్శి సమరం అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట భూబాధితులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష గురువారం పదో రోజుకు చేరింది. దీక్షా శిబిరాన్ని సందర్శించిన సమరం సంఘీభావం తెలిపారు. అసైన్డ్ కమిటీ ద్వారా ఇచ్చిన భూములను ఆన్‌లైన్ చేయాలని బాధితులు చేస్తున్న ఆందోళనకు అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం చొరవ చూపి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయకార్మికసంఘం జిల్లా సహాయ కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, భూబాధితులు సుగుణారావు, ఎం.కోటేశు, ఎం.విశ్వేశ్వరరావు, కె.శిఖామణి, వై.మేరీగ్రేసు, ఎం.మరియమ్మ, సీహెచ్ సుబ్బమ్మ, ఏ.సుగుణ, పి.కమల పాల్గొన్నారు.

## దసరా సెలవుల్లో పాఠశాలలు నిర్వహించరాదు

●ఏపీఎస్ఎఫ్ నేత రాజేష్

**గన్నవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** దసరా సెలవుల్లో ప్రయివేటు పాఠశాలలు తరగతులు నిర్వహించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఏపీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చిల్లర రాజేష్ కోరారు. విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవో-2 కమలకు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. రాజేష్ మాట్లాడుతూ అధికారికంగా ప్రకటించిన సెలవుల్లో ఏ పాఠశాలలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ తరగతులను నిర్వహించకూడదన్నారు. సెలవుల్లో బలవంతపు తరగతుల భారం లేకుండా చూడాలని చెప్పారు. గన్నవరం నియోజకవర్గ కార్యదర్శి విజి ధీరజ్, సంజు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు మీదకు నిర్మించిన మెట్లు తొలగించాలి

**గన్నవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** ఆక్రమణ తొలగించి పాఠశాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. చింతలపేట ఎంపీపీ పాఠశాల సమీపంలో రోడ్డును ఆక్రమించి మెట్లు నిర్మించారు. దీని వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. చుట్టు ప్రక్కల వారు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పినా పట్టించుకోవటం లేదు. ఇంట్లో మురుగునీరు పోయే పైప్‌లైన్‌లు రోడ్డు మీదే గోడకు పెట్టేశారు. చుట్టు పక్కల అపార్టుమెంట్, ఇళ్లల్లోకి కార్లు వెళ్ళేందుకు ఇబ్బందిగా మారింది. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించటం లేదని ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఆరోగ్యంపై అవగాహన అవసరం

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) :** స్వస్థ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వీరవల్లి పీహెచ్‌సీ వైద్యులు కోడూరుపాడులో గురువారం ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. వీరవల్లి పీహెచ్‌సీలో మహిళలకు ప్రత్యేక స్క్రీనింగ్ పరీక్షలు జరిపారు. రక్తపోటు, మధుమేహం లాంటి వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఏఎంసీ డైరెక్టర్ ఆర్నేపల్లి రామలక్ష్మి, టీడీపీ అధ్యక్షుడు కొండపల్లి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఆర్నేపల్లి సూరిబాబు, టీఎన్‌టీయుసీ నాయకుడు బి. పాండురంగారావు, రామకృష్ణ, 108 సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# సామూహిక ఎలుకల నిర్మూలనతో పంట దిగుబడులు పెంపు

● జిల్లా వ్యవసాయాధికారిణి ఎన్.పద్మావతి

**ఉంగుటూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) :** వరి పంటలో వివిధ దశల్లో నష్టం కలిగించే ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని రైతులందరూ సమష్టిగా చేపడితే పంటదిగుబడిని పెంచుకోవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.పద్మావతి అన్నారు. వ్యవసాయశాఖఆధ్వర్యంలో ఉంగుటూరు మండలం పొణుకుమాడు పీఏసీఎస్‌లో గురువారం సామూహిక ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ సుంకర రాజేష్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి మాట్లాడుతూ ఎలుకల తాకిడివల్ల వరి పంటలో ఏటా ఎకరాకు 8 నుంచి 10బస్తాల దిగుబడి తగ్గుతుందన్నారు. ఎలుకల నివారణకు ప్రభుత్వం వంద శాతం సబ్సిడీపై బ్రోమోడయోలిన్ ఎలుకల నిర్మూలన మందును రైతులకు ఉచితంగా అందజేస్తుందని వివరించారు..

**జిల్లావ్యాప్తంగా 1785కిలోల బ్రోమోడయోలిన్ మందు పంపిణీ**

జిల్లావ్యాప్తంగా లక్షా75వేల ఎకరాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. 785 కిలోల బ్రోమోడయోలిన్ మందును అన్ని రైతుసేవాకేంద్రాల్లో రైతులకు అందుబాటులో వుంచినట్లు పద్మావతి తెలిపారు. ఎలుకల నివారణపై అవగాహన కల్పించే పోస్టర్లు, కరపత్రాలను అధికారులతో కలిసి ఆమె ఆవిష్కరించారు.

**బ్రోమోడయోలిన్‌తో విషపు ఎర తయారీ**

సామూహిక ఎలుకల నిర్మూలనలో భాగంగా రైతుల సమక్షంలో బ్రోమోడయోలిన్ మందు కలిపిన విషపు ఎర తయారు చేయించారు. అధికారులు, రైతులతో కలిసి వరిచేలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. పొలం గట్లపై ఎలుక బొరియలను స్వయంగా గుర్తించిన బ్రోమోడయోలిన్ కలిపిన విషపు ఎర పొట్లాలను ఉంచారు. జేడీఏ ముళ్లపూడి పద్మావతి(అబ్జర్వర్), మండల వ్యవసాయాధికారి గద్దె రమేష్, ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో జూట్రు ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ సుంకర రాజేష్, సీఈవో భువనం రాఘవయ్య, వీపీఏలు, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


సాగుదారులతో కలిసి వరిపొలాలను సందర్శిస్తున్న డీఏవో



## ఆశాజ్యోతి పాఠశాలకు మానవత విరాళం

**హనుమాన్‌జంక్షన్:** ఏలూరు రోడ్డులోని ఆశాజ్యోతి దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలకు మానవత జంక్షన్ శాఖ ఆధ్వర్యంలో గురువారం రూ11,100 విరాళం అందజేశారు. మానవత పూర్వ కార్యవర్గ సభ్యులు ఉడతా కృష్ణమోహన్ జ్ఞాపకార్థం ఆయన భార్య శివపార్వతి విద్యార్థుల అన్నప్రసాదం నిమిత్తం విరాళం అందజేశారు. మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు చేతులు మీదుగా పాఠశాల నిర్వాహకుడు మరీదు వెంకటస్వామికి అందజేశారు. మానవత సభ్యులు పాల్గొన్నారు.

# రాకింగ్ రోబోస్..!



- సిద్ధార్థ వర్సిటీలో జాతీయ రోబోటిక్స్ పోటీలు
- ఇన్నోవేట్, ఆటోమేట్, డామినేట్ అంశాల్లో ఆరు విభాగాల్లో రోబోలతో ప్రదర్శన
- దేశంలోని పలు కళాశాలల నుంచి 400 మంది విద్యార్థుల హాజరు
- ఆరు థీమ్స్‌లో 66 జట్లు పోటీ
- ఆధునికతను ప్రతిబింబించేలా విన్యాసాలు

కానూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆధునిక యుగంలో రోబోటిక్స్ టెక్నాలజీ వినియోగించి రోబోలను తయారుచేసి వివిధ రకాలుగా సమాజ శ్రేయస్సుకు ఎలా వినియోగించవచ్చో నిరూపించారు ఇంజనీరింగ్ మెకానికల్ విభాగం విద్యార్థులు. దేశంలోని పలు ఇంజనీరింగ్ కళాశాల నుంచి విద్యార్థులు తరలివచ్చి కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ వర్సిటీలో రోబో ఎక్స్-2025 పేరుతో నిర్వహించిన పోటీల్లో సుమారు 400 మంది విద్యార్థులు పాలుపంచుకున్నారు. గురువారం ప్రారంభమైన ఈపోటీలు శుక్రవారం వరకు కొనసాగుతాయి.



### ఆరు అంశాల్లో రోబో పోటీలు

సిద్ధార్థ వర్సిటీలో జరిగిన రోబో ఎక్స్ పోటీలు ఆరు అంశాల్లో సాగాయి. ఈ అంశాలన్నీ రోబోలు వివిధ రంగాల్లో ఎలా ఉపయోగకారిగా పనిచేస్తాయో చేప్పేలా విద్యార్థులు తమ ప్రదర్శనలతో నిరూపించారు. రోబో యుద్ధం అనే అంశంపై జరిగిన పోటీలో యుద్ధంలో శత్రువుల నుంచి రోబో సాయంతో తమను ఎలా కాపాడుకోవచ్చో విద్యార్థులు స్పష్టంగా వివరించారు. సెల్‌ఫోన్ బ్లూటూత్ ఆధారంగా ట్యాంక్ టైపులో ఉన్న యుద్ధ రోబోను ప్రదర్శించారు. పాత్‌ఫైండర్ చాలెంజ్ అనే అంశంపై డ్రైవర్ లేకుండా ఆటోమేటిక్ పద్ధతిలో వాహనం దారితప్పకుండా ఎలా నడపవచ్చో తమ ప్రదర్శనతో నిరూపించారు. ప్రెసిషన్ పిక్ అండ్ ప్లేస్ అనే అంశంపై ఒక ప్రదేశం నుంచి వస్తువులను మరో ప్రదేశానికి సమయపాలనకు అనుగుణంగా ఖచ్చితంగా చేర్చడానికి దోహదపడేలా రోబో సాయంతో ప్రదర్శించారు. అగ్రిబోట్ చాలెంజ్ పేరుతో వ్యవసాయ రంగంలో రోబోను వినియోగించి మనుషులు వచ్చే జాడ, గ్యాస్ వాసన తదితర అంశాలను ఎలా గ్రహించవచ్చో నిరోపించారు. మిషన్ రెస్క్యూ రోబో విధానంలో విపత్తుల్లో మనుషులను ఎలా కాపాడాలి, వారికి ఆహారం, మందులు, నీరు, లైఫ్ జాకెట్లు రోబో సహాయంతో ఎలా అందించగలమో విద్యార్థులు వివరించారు. ఇండస్ట్రీ 4.0 ఛాలెంజ్ అంశంప పరిశ్రమల్లో మనుషుల సంఖ్య తగ్గించి రోబోలను వినియోగించి తక్కువ ఖర్చుతో, సమయాన్ని ఎలా ఆదా చేయవచ్చో వారు వివరించారు. ఈ రోబోటిక్స్ ప్రదర్శనగురించి విద్యార్థులు వెలిబుచ్చిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

## పరిశ్రమల భవిష్యత్ రూపకల్పనలో రోబోటిక్స్ పాత్ర కీలకం

- రోబ్ ఎక్స్ ప్రారంభోత్సవంలో డాక్టర్ కృష్ణ దొర

పరిశ్రమల భవిష్యత్ రూపకల్పనలో రోబోటిక్స్, ఏఐ, స్మార్ట్ ఆటోమిషన్ పాత్ర ఎంతో కీలకమని వాల్టీనో సిస్టమ్స్ (హైదరాబాద్)వ్యవస్థాపకుడు, ఎండీ కృష్ణ దొర అన్నారు. కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ వర్సిటీలో రెండు రోజుల పాటు రోబో ఎక్స్-2025 పేరుతో జరిగే జాతీయ రోబోటిక్స్ విద్యార్థి పోటీలను గురువారం ఆయన జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కృష్ణ దొర ప్రసంగిస్తూ సమాజాభివృద్ధికి స్థిరమైన పరిష్కారాలు చూపే యువ ఇంజనీర్లను ప్రోత్సహించాలన్నారు. వీసీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోటీల్లో వివిధ విభాగాల్లో విజేతలకు రూ. 2లక్షలు పైగా బహుమతులు అందజేస్తామన్నారు. ప్రొ. వీసీ ఏవీ రత్నప్రసాద్, వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఎస్ రవికుమార్, కన్వీనర్ డాక్టర్ జీ ఢిల్లీబాబు, వర్సిటీ రిజిస్ట్రార్ ఎం రవిచంద్, ఎస్ఏజీటీఈ అధ్యక్ష, కార్యదర్శులు ఏ రాజయ్య, పీ లక్ష్మణరావు, డాక్టర్ డీ పాండురంగారావు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు.




### రోబో ఎక్స్‌లో విద్యార్థుల పాత్ర కీలకం



విజయవాడలో రోబో ఎక్స్ పేరుతో సిద్ధార్థ వర్సిటీలో నిర్వహిస్తున్న రోబో ఎక్స్ పోటీలో విద్యార్థుల పాత్ర కీలకం. పోటీలకు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. దేశవ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ కళాశాల నుంచి 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆధునిక రోబోటిక్స్‌పై వర్క్‌షాప్‌లు నిర్వహించాం. విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.

డాక్టర్ ఎస్ రవికుమార్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి, సిద్ధార్థ వర్సిటీ

### పోటీతత్వాన్ని పెంచింది



రోబో ఎక్స్ పేరుతో నిర్వహించిన జాతీయ రోబోటిక్స్ పోటీలు పోటీతత్వాన్ని పెంచాయి. రోబో యుద్ధం అంశంపై జరిగిన ప్రదర్శన ప్రత్యర్థి యంత్రాన్ని నిలిపివేయడం, అధిగగమించడం ఎలా సాధ్యమో కళ్లకు కట్టినట్టు ఉంది.

ఎస్ జ్యోతిర్మయి, విద్యార్థిని, లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, మైలవరం

### ఆకట్టుకున్న సాంకేతికత



జాతీయ ప్రదర్శనలో రోబోటిక్స్ సాంకేతికత ఎంతగానో ఆకట్టుకుంది. డ్రైవర్ లేకుండా సాంకేతిక సాయంతో కారులు, తదితర వాటిని ఎలా నడపవచ్చో ఈ ప్రదర్శనలో ఉంచడం ఆసక్తిరేపింది.

కే దేవీశ్రీ, విద్యార్థి, వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల, విజయవాడ

### ఆటోమేషన్ నైపుణ్యాలు హైలెట్



రోబో ఎక్స్ పోటీల్లో ఆటోమేషన్ నైపుణ్యాలు హైలెట్‌గా నిలిశాయి. ఆధునిక కాలంలో రోబోలు ఎలా పనిచేస్తాయో చక్కగా కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఆరు విభాగాల్లో నిర్వహించిన ప్రదర్శనలు అబ్బురపరిచాయి.

ఎస్ దినేష్, విద్యార్థి, శ్రీవాసవి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీ కాలేజీ, నందమూరు

### రోబో టెక్నాలజీపై అవగాహన పెరిగింది



జాతీయ రోబో ఎక్స్ ప్రదర్శనతో రోబో టెక్నాలజీపై అవగాహన పెరిగింది. ప్రస్తుతం రోబోల పాత్ర, ఉపయోగాలు, వినియోగించే విధానాన్ని ప్రదర్శన రూపంలో తెలుసుకోగలిగాం. ఇవి భవిష్యత్ ప్రయోగాల్లో దోహదపడతాయి.

జీ జ్ఞానదీప్, విద్యార్థి, వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల, విజయవాడ

### వ్యవసాయంలో రోబోటిక్ టెక్నాలజీ



వ్యవసాయ రంగంలో రోబో టెక్నాలజీని ఎలా వినియోగించవచ్చో మా టీమ్‌తో ప్రదర్శించాం. ఎంతగానో ఆకట్టుకుంది. విత్తడం, మొక్కలు పర్యవేక్షించడం, నీటిపారుదల వంటి పనులను రోబో నిర్వహించడం ప్రదర్శించాం.

షేక్ రేష్మా, విద్యార్థిని, డీవీఆర్ డీహెచ్ఎస్ కళాశాల, కంచకచర్ల

### విపత్తుల్లో రోబోల పాత్రను ప్రదర్శించాం



విపత్తుల సమయంలో రోబోల పాత్ర ఎలా ఉంటుందో మా టీమ్‌తో ప్రదర్శించాం. ఆపదలో ఉన్నప్పుడు రోబో సాయంతో ఎలా బయటపడవచ్చో తెలిపాం. బాధితుడికి అవసరమైన వాటిని రోబో ద్వారా ఎలా చేర్చవచ్చో చెప్పాం.

ఆర్ జశ్వంత్ సాయి, విద్యార్థి, ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాల, చౌడవరం

## రెండు మండలాలను విజయవాడలో కలపాలి

- అసెంబ్లీలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ



గన్నవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాగునీరు, చెత్త సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న గన్నవరం, విజయవాడ రూరల్ మండలాలను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ప్రారంభమైన శాసనసభ వర్షాకాల సమావేశాల్లో యార్లగడ్డ పలు సమస్యలు ప్రస్తావించారు. ప్రకాశం బ్యారేజీకి కూతవేటు దూరంలో విజయవాడ రూరల్ మండలంలోని 9 గ్రామాల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంబాపురంలో రూ.2500 కోట్లతో చేపట్టిన పథకం వల్ల ఏమాత్రం ప్రయోజనం లేదన్నారు. ప్రత్యామ్నాయంగా కరెన్సీ నగర్ వరకు ఉన్న తాగునీటి పైపు లైనును ముందుకు పొడిగిస్తే తక్కువ ఖర్చుతో కృష్ణా నీటిని అందించవచ్చన్నారు. అలాగే చెత్త సమస్య రోజు రోజుకీ తీవ్ర రూపం దాలుస్తుందని, పరిష్కారం కోసం రూరల్ మండలంలోని 9 గ్రామాలను, గన్నవరం మండలాన్ని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న పీఏసీఎస్ కార్యదర్శులను బదిలీ చేయాలని గత అసెంబ్లీ సమావేశాల్లో కోరితే ఇంతవరకు స్పందించలేదని వీరిని బదిలీ చేసే ఆలోచన ప్రభుత్వానికుందా లేదా అని సూటిగా ప్రశ్నించారు. విజయ డెయిరీ బాపులపాడు మండలంలో నిర్మించిన కామధేను ప్లాంట్లో జరిగిన అక్రమాలకు సంబంధించిన ఆధారాలను ప్రభుత్వానికి ఇప్పటికే అందజేసి విచారణ కోరితే ఇంత వరకు జరగలేదని ఇప్పటికైనా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## బుడమేరు కట్ట అభివృద్ధి చేయాలి

- పెనమలూరు ఎమ్మెల్యే బోడె



కంకిపాడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది బుడమేరు కట్టలు తెగి విజయవాడతో పాటు దిగువనున్న పెనమలూరు నియోజకవర్గం కంకిపాడు మండలంలోని వేల్పూరు, ఉప్పలూరు, మంతెన గ్రామాలపై తీవ్ర ప్రభావం చూపించిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గురువారం జరిగిన శాసనసభ సమావేశాల్లో ప్రస్తావించారు. మండలంలోని ఈ మూడు గ్రామాల పరిధిలోని బుడమేరు కట్టలు తెగిపడ్డాయని, ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఇరిగేషన్ శాఖ మంత్రి రామానాయుడు విశేషంగా కృషి చేసి కాంక్రీట్ వాల్స్ ఏర్పాటు చేశారన్నారు. అయితే దిగువన బుడమేరు అభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టలేదని, అనేకమార్లు వారి దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. రూ.5లక్షల సొంత నిధులతో మండలంలోని వేల్పూరులోని బుడమేరు కట్ట తాత్కాలికంగా అభివృద్ధి చేశామన్నారు. భారీ వరదల వస్తే రైతులు, గ్రామస్థులకు తీవ్ర ఇబ్బందులు తప్పవన్నారు. స్పీకర్ ద్వారా మంత్రి రామానాయుడు దృష్టికి తీసుకువెళ్తున్నామని తెలిపారు. తక్షణం చర్యలు చేపట్టాలని ఆయన అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వాన్ని కోరారు.

## తగ్గిన జీఎస్టీతో యువతకు ఉపాధి

- తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి



తిరువూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై భారం తగ్గించే ఏ నిర్ణయమైనా సమాజం హర్షిస్తుందని, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు విజన్ 2047 ప్రకారం, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు అయ్యేనాటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దేశం మొదటి రెండు స్థానాల్లో ఉంటుందని, గణాంకాలతో సహా సీఎం అనేక సందర్భాల్లో తెలిపారన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా యువనేత నారా లోకేశ్ యువతరానికి ఇచ్చిన ప్రధాన హామీ, 20 లక్షల ఉద్యోగ ఉపాధి అవకాశాలని, ఆ హామీ జీఎస్టీ తగ్గించడం వలన నెరవేరుతుందనే నమ్మకం ఏర్పడిందన్నారు. ధరలు అందుబాటులో ఉండి ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగితేనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో పన్నులు తగ్గడంతో దేశంలో ఉత్పత్తి పెరిగేందుకు, ప్రజల్లో వినియోగం పెరిగేందుకు తద్వార రాష్ట్రాలు, దేశం వేగంగా ముందుకు వెళ్లేందుకు దోహదపడతాయన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలోని ప్రజలకు కల్పిస్తున్న వెసులుబాటు కారణంగానే ప్రజలు మనల్ని ఆశీర్వదిస్తారని ఎమ్మెల్యే కొలికపూడి పేర్కొన్నారు.

## రియల్ టైమ్ నిబంధనతో పారిశ్రామికీకరణకు విఘాతం

- మైలవరం ఎమ్మెల్యే వసంత



ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది వచ్చిన ఇంటిగ్రేటెడ్ గ్రీన్ ఎనర్జీ పాలసీలో రియల్ టైమ్ అనే నిబంధనలతో పారిశ్రామికీకరణకు విఘాతం కలుగుతుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గురువారం రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో అన్నారు. ఈ పాలసీలో భాగంగా సంప్రదాయేతర విద్యుత్ వనరులు సోలార్, విండ్ పవర్ నుంచి ఏ 15 నిముషాల్లో ఉత్పత్తయిన విద్యుత్‌ను అదే 15 నిముషాల్లో సద్వినియోగం చేసుకోవాలని రియల్ టైమ్ అనే పేరుతో క్లాజ్ పెట్టారన్నారు. సోలార్, విండ్ ఈరెండు ప్రకృతిపై ఆధారపడి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాయన్నారు. సోలార్ సూర్యరశ్మిపై, విండ్ పవర్ వాయువుపై ఆధారపడి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుండగా, అదే సమయంలో విద్యుత్‌ను ఉపయోగించుకోవడం అసాధ్యమన్నారు. రియల్ టైమ్ నిబంధనతో పరిశ్రమలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. రాష్ట్రంలో భారీ ఎత్తున పారిశ్రామికీకరణ చేపట్టి ఎన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే ప్రభుత్వ సంకల్పానికి రియల్ టైమ్ నిబంధన ప్రతిబంధకంగా మారిందన్నారు. దార్శనీకుడు చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఆ పాలసీని సవరించాలని కోరారు.

## ప్రపంచస్థాయి మౌలిక వసతులతో అమరావతి

- సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు

విజయవాడ సిటీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆధునిక ప్రభుత్వ సదుపాయాలు, సమగ్ర మౌలిక వసతులతో గ్లోబల్ ప్రమాణాలకు తగినట్టు అమరావతి ప్రపంచ స్థాయి రాజధానిగా నిలుస్తుందని సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు అన్నారు. 11వ అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్‌లో భాగంగా విజయవాడలోని ఏ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన అమరావతి ప్రభుత్వ సముదాయాల సూక్ష్మ నమూనాలను గురువారం ఆయన సందర్శించి మీడియాతో మాట్లాడారు. శాసనసభ, 50 అంతస్తుల సచివాలయం, హెచ్‌వోడీ టవర్స్, జేఏడీ కాంప్లెక్స్, మెట్రోలైన్ తదితర కీలక వసతులను అమరావతిలో కల్పిస్తుందన్నారు. పచ్చని వనరులు, సమగ్ర రవాణా మార్గాలు, డిజిటల్ సదుపాయాలు సమన్వయం కావడంతో స్థిరమైన అభివృద్ధికి ఆదర్శనగరంగా రూపుదిద్దుకుంటుందన్నారు. కృష్ణానదికి భారీగా వరద వచ్చినా అమరావతి ముంపునకు గురయ్యే అవకాశం లేదన్నారు. భవిష్యత్తులో అక్కడ నివాసం ఉండబోయే ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఉండేలా ప్రణాళిక చేశామన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ ఆదేశాలతో భవన నిర్మాణ పనులు శరవేగంతో సాగుతున్నాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు నడిచి వెళ్లేలా, సైకిల్‌పై వెళ్లేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. భవిష్యత్తు తరాల మనుగడను దృష్టిలో ఉంచుకుని అమరావతిని అధునాతన సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోందన్నారు. నారెడ్కో అధ్యక్షుడు గద్దె చక్రధర్ మాట్లాడుతూ అమరావతిపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి ఈ ప్రాపర్టీ షో అద్దం పడుతుందన్నారు. ఈ నెల 19, 20, 21న ఏ కన్వెన్షన్‌లో జరిగే ప్రాపర్టీ షోలో డెవలపర్లు, కొనుగోలుదారులు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. నారెడ్కో సెంట్రల్ జోన్ అధ్యక్షుడు మండవ సందీప్, ప్రాపర్టీ షో చైర్మన్ పరుచూరి కిరణ్, నారెడ్కో సెంట్రల్ జోన్ కార్యదర్శి ఎస్వీ రమణ, ప్రతినిధులు పీవీ కృష్ణ, వంశీ, కోడే జగన్, హరిప్రసాద్ పాల్గొన్నారు.



ప్రాపర్టీ షోలో అమరావతి నమూనా చూస్తున్న కన్నబాబు

## కోట్లు ఖర్చుపెట్టినా నిరుపయోగమే?

**ఇరువైపులా అప్రోచ్ రోడ్లు లేక అక్కరకు రాని వైరాయేటిపై నిర్మించిన వంతెన**

- వరదలకు దెబ్బతిన్న కాజ్‌వే
- వాహనాల రాకపోకలు పూర్తిగా బంద్
- 2 నెలలుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఆంధ్రజ్యోతి - కంచికచర్ల: మండలంలోని చెవిటికల్లు - వత్సవాయి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో నందిగామ మండలం దాములూరు కూడలి, వీరులపాడు మండలం పల్లెంపల్లి గ్రామాల మధ్య వైరాయేటిపై రూ. 7 కోట్లతో నిర్మించిన వంతెన 8 ఏళ్లుగా నిరుపయోగంగా పడి ఉంది. వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్లు వేయకపోవడంతో వంతెన ఉపయోగపడటం లేదు. వరదలకు లోలెవల్ కాజ్‌వే దెబ్బతింది. 2 నెలలుగా ఈ మార్గంలో రాకపోకలు సాగటం లేదు. కూడలి వంతెన ఎగువన కొద్దిదూరంలో వైరాయేటిలో కట్లేరు కలుస్తుంది. వాహనాల రాకపోకలకు దశాబ్దాల క్రితం ఈ యేటిలో లోలెవల్ కాజ్‌వే ఏర్పాటు చేశారు. అయితే వైరా లేదా కట్లేరుకు వరద వచ్చినప్పుడల్లా కాజ్‌వే పూర్తిగా మునిగిపోతోంది. వర్షాకాలంలో వాహనాల రాకపోకలు బంద్ అవుతున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ.6.50 కోట్లు మంజూరు చేసింది. 200 మీటర్ల పొడవున్న వంతెన నిర్మించారు. అప్రోచ్ రోడ్లు వేయలేదు. దీంతో అప్పటి నుంచి వంతెన నిరుపయోగంగా పడి ఉంది. ఇక కాజ్‌వేనే దిక్కైంది. అయితే ఈ ఏడాది రోజుల తరబడి భారీ వర్షాలు పడుతుండటంతో వైరాయేరు, కట్లేరులకు వరద ఎక్కువగా వస్తోంది. కాజ్‌వేపై ఆరేడు అడుగుల ఎత్తున వరద పొంగుతోంది. వరదల ఉధృతికి కాజ్‌వే కూడా దెబ్బతింది. ఈ మార్గంలో 2 నెలల నుంచి వాహనాల రాకపోకలు బంద్ కావటంతో సుమారుగా 40 గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ పాలకుల్లో స్పందన కరువైంది.





అప్రోచ్ లేనందున నిరుపయోగంగా ఉన్న కూడలి వంతెన, వరదలకు దెబ్బతిన్న కాజ్‌వే

## విద్యుత్ ఏఈపై విచారణకు ఆదేశం..!

తోట్లవల్లూరు, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా కేటగిరి-1 విద్యుత్ సర్వీసును పశువులషెడ్డుకి కేటాయించినందుకు మండల విద్యుత్ ఏఈ దేవదాసుపై విచారణకు ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి కే విజయానంద్ ఆదేశాలిచ్చారని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవరపల్లిలో ఎస్సీ కులానికి చెందిన కే ఉమా మహేశ్వరీ ఇంటికి జగ్జీవన్‌జ్యోతి పథకం కింద కేటగిరి-1 సర్వీసు ఇచ్చారని, దాన్ని రెడ్డిబత్తుల శ్రీనివాసరెడ్డి పశువులషెడ్డుకి అక్రమంగా ఏర్పాటు చేసినందుకు విచారణకు విజయానంద్ ఆదేశాలిచ్చారని శ్రీనివాసగౌడ్ తెలిపారు.

### ఏఈ వివరణ

మండలానికి తాను ఏఈగా రాకముందే శ్రీనివాసరెడ్డి పశువులషెడ్డుకు ఉమామహేశ్వరి పేరున ఉన్న విద్యుత్ సర్వీసుకు అక్రమంగా బిగించారని, తాను వచ్చాక 2021లో దీన్ని గుర్తించానని ఏఈ దేవదాసు తెలిపారు. ఉమా మహేశ్వరి చనిపోవటంతో ఖాళీగా ఉన్న ఆమె సర్వీసుని శ్రీనివాసరెడ్డికి ఇచ్చినట్టుగా తేలిందని, దాంతో సర్వీసు కేటగిరిని మార్చి అప్పటి వరకు ఎస్సీ కోటాలో వాడుకున్న విద్యుత్‌ని లెక్కగట్టి రూ.5వేల వరకు పెనాల్టీ విధించి శ్రీనివాసరెడ్డి నుంచి వసూలు చేసి సంస్థకు నష్టం లేకుండా చేశామన్నారు. విజిలెన్స్ అధికారులు విచారణకు వస్తే ఈ విషయాలను నివేదించానని ఏఈ పేర్కొన్నారు.

## పోర్టు వాటర్ బ్రేక్ వాల్ వద్ద ప్రమాదం

- సముద్ర ముఖ ద్వారం వద్ద ముక్కలైన బోటు, ఇద్దరికి గాయాలు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్యాంపుబెల్‌పేటకు చెందిన ఒక బోటు సముద్ర ముఖద్వారం వద్ద పోర్టు బ్రేక్ వాటర్ వాల్‌ను ఢీకొని ముక్కలైంది. సముద్రపు అలలు ఉధృతంగా ఉండటంతో ఈ ప్రమాదం జరిగింది. అలలు తీవ్రంగా తాకడంతో బ్రేక్ వాటర్ వాల్స్‌ను బోటు వేగంగా ఢీకొంది. దీంతో పడవ ముక్కలైంది. గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో బోటులో ప్రయాణిస్తున్న బోటు యజమాని తిరుమాని ఫణికుమార్ (40) తీవ్రంగా గాయపడ్డాడు. కాలికి, చేతికి బలమైన గాయాలయ్యాయి. ఇతడితో పాటు ప్రయాణిస్తున్న చింతా రామచంద్రరావుకు స్వల్ప గాయాలయ్యాయి. తిరుమాని ఫణికుమార్‌ను స్థానికులు, మాజీ సర్పంచ్ నాగుల్‌మీరా, టీడీపీ నేత బత్తిన నాగరాజు ఆసుపత్రిలో చేర్చారు. సామాన్య కుటుంబానికి మత్స్యకారుడు ఫణికుమార్ బోటు ముక్కలుచెక్కలవడంతో ఆర్థికంగా కుంగిపోయాడు. బోటు ఖరీదు దాదాపు రూ.7లక్షల వరకు ఉంటుందని అంచనా. మత్స్యశాఖాధికారులు విచారణ ప్రారంభించారు. సంఘటన తెలుసుకున్న మంత్రి కొల్లు రవీంద్ర గాయపడిన వారిని ఫోనులో పరామర్శించారు. ఆసుపత్రిలోని వైద్యులకు తక్షణ వైద్య సేవలందించాలని సూచించారు.





సముద్ర ముఖ ద్వారం వద్ద ముక్కలైన బోటు, తీవ్రంగా గాయపడి జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరుమాని ఫణికుమార్

## నగర ప్రాచుర్యం, కళలు పరిచయం చేసేందుకే 'విజయవాడ ఉత్సవ్' నిర్వహణ

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

వన్‌టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో జరిగే దసరా ఉత్సవాలను పురస్కరించుకుని దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు విజయవాడ ప్రాచుర్యం, కళలను పరిచయం చేసేందుకే 'విజయవాడ ఉత్సవ్' నిర్వహిస్తున్నట్టు విజయవాడ ఉత్సవ్ సభ్యుడు, ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. వ్యాపారస్తులందరూ విద్యుత్ దీపాలంకరణతో విజయవాడ ఉత్సవ్‌లో భాగస్వామ్యం కావాలని కోరుతూ గురువారం రాత్రి వన్‌టౌన్ అర్జున వీధిలోని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తన నివాసానికి ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకారం ప్రారంభానికి ఎంపీ కేశినేని చిన్ని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రిమోట్‌తో విద్యుత్ దీపాలంకరణను వెలిగించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ విజయవాడ ఉత్సవ్‌లో నగర ప్రజలంతా భాగస్వాములై అమ్మవారి భక్తులకు వినోద ప్రదర్శనలు అందిస్తారన్నారు. ఈ సందర్భంగా నగరం మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించనున్నట్టు తెలిపారు. ప్రజలు తమ ఇళ్లను, షాపులను విద్యుత్ దీపాలతో అలంకరించుకోవాలని కోరారు. ఆలీబాబా 40 దొంగల్లా జగన్ బాబా డజన్ దొంగలు తయారయ్యారని, వారంతా ఒకచోట చేరి అబద్దాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మాట్లాడుతూ దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఆహ్లాదపరిచేందుకు విజయవాడ ఉత్సవ్‌ను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవ్‌లో భాగస్వామ్యం కావాల్సిన వైసీపీ నేతలు వివాదంగా మారుస్తున్నారని, పేర్ని నాని కోర్టులను కూడా విమర్శిస్తున్నారన్నారు. నాడు కోర్టు స్టే ఇస్తే సంబరాలు చేసుకోవచ్చు కానీ, విజయవాడ ఉత్సవ్ దేవదాయ శాఖ భూమిలో నిర్వహించుకోవటానికి స్టే ఇస్తే కోర్టును విమర్శిస్తారా అని ప్రశ్నించారు. టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా, టీడీపీ మాజీ ఫ్లోర్ లీడర్ గుండారపు హరిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, నగరాల కార్పొరేషన్ చైర్మన్ మరుపిళ్ల తిరుమలేష్, రాష్ట్ర మహిళా నాయకురాలు తుపాకుల రమణమ్మ, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ చిన్ని



## ఉత్సవ్ పేరుతో వసూళ్లు

- మాజీ మంత్రి పేర్ని నాని

పాయకాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఉత్సవ్ పేరుతో ఎంపీ కేశినేని చిన్ని నగరంలో వసూళ్లకు పాల్పడి జేబులు నింపుకుంటున్నారని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని మల్లాది విష్ణు కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో మాజీ మంత్రులు పేర్ని నాని, వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, దేవినేని అవినాష్ పలు విమర్శలు చేశారు. పేర్ని నాని మాట్లాడుతూ ఎంపీ చిన్ని కార్యాలయం వసూళ్ల కేంద్రంగా మారిందని, పెద్దిరెడ్డి అనే వ్యక్తిని పెట్టి రేషన్ దందా నడిపి నెలకు రూ.1.20 కోటి వసూళ్లు చేస్తున్నారన్నారు. ఇసుక రీచ్‌లతో పాటు బూడిద అక్రమంగా హైదరాబాద్, ఖమ్మం తరలించి కోట్లు గడిస్తున్నారన్నారు. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విజయవాడ ఉత్సవ్ పేరుతో ఎంపీ అమ్మవారి ప్రతిష్ఠతో పాటు విజయవాడ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. దసరా ఉత్సవాల్లో మాంసాహారం అమ్మటం సిగ్గుచేటన్నారు. మల్లాది విష్ణు, దేవినేని అవినాష్ మాట్లాడుతూ నగరంలో సంక్షేమం, అభివృద్ధిపై ఎంపీ చిన్ని సవాల్‌ను తాము స్వీకరిస్తున్నామన్నారు.

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి (రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 133 , 142, 153 |
| చికెన్ విత్ స్కిన్ | 254 |
| చికెన్ స్కిన్‌లెస్ | 264 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560



### విఘ్నేశ్వరస్వామి ఆదాయం రూ.6.02లక్షలు

గుడివాడ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : స్థానిక విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థాన ఆదాయ హుండీ లెక్కింపు ద్వారా రూ.6.05లక్షల ఆదాయ సమకూరినట్లు ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం దేవస్థాన ఆవరణలో ఆలయ ధర్మకర్తల కమిటీ, దేవాదాయ శాఖ గుడివాడ తనిఖీదారు ఉయ్యూరు సుధాకర్‌ల సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ సాయన రాజేష్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

# దేవాలయాల అభివృద్ధికి సమష్టి కృషి అవసరం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కొండాలమ్మ అమ్మవారి దేవస్థాన సాంప్రదాయాలను కొనసాగిస్తూ, దేవస్థాన ప్రతిష్టను మరింత పెంచేలా పాలకవర్గం బాధ్యతలు నిర్వహించాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. వేమవరంలోని కొండాలమ్మ దేవస్థాన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం అమ్మవారి ఆలయ అలివేటి మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ ఆధ్యాత్మిక దృక్పథం, సేవా గుణం ఉన్న వారినే ఎంచుకొని ఈ పాలకమండలిని ఏర్పాటు చేశామన్నారు. తొలుత అంగలూరు నుంచి వందలాది మోటార్ బైక్‌లపై భారీగా ర్యాలీ వేమవరం కొండలమ్మ ఆలయం వరకూ నిర్వహించారు. అనంతరం పాలక మండలి సభ్యులుగా ఈడే వెంకట విష్ణుమోహనరావు, తూము రాజ్యలక్ష్మి, వాణి, ముగం ఆంజనేయులు, కళ్లేపల్లి సుగుణశేఖర్,మన్నెం వీరనాగేంద్రరావు,వడ్లమూడి రవీంద్రబాబు, శ్యామలా దేవి, నూతులపాటి లక్ష్మీపావని, ఎక్స్ అఫీషియో సభ్యునిగా అర్చకుడు రుద్రపాటి శరత్చంద్ర శివ సంతోష్ శర్మలచే ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఈడే వెంకట విష్ణుమోహనరావును సభ్యులు చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు బాపయ్య చౌదరి, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జనార్దనరావు, జనసేన గుడివాడ నియోజక వర్గ ఇన్‌చార్జ్ శ్రీకాంత్, పాల్గొన్నారు.



ఉత్సవాల పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వెంకట విష్ణుమోహనరావు

**దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలపై సమీక్ష**

వేమవరం కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ నుండి నిర్వహించనున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలపై నూతన పాలకమండలి తొలి సమావేశం గురువారం చైర్మన్ చాంబర్‌లో నిర్వహించారు. చైర్మన్ ఈడే వెంకటవిష్ణుమోహనరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు సౌకర్యాల ఏర్పాట్లు, అధికారులు, ముఖ్య ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు ప్రొటోకాల్ అంశాలపై దేవాలయ అధికారులు,ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు,పాలకమండలి సభ్యులు తూము రాజ్యలక్ష్మి, గుడ్లవల్లేటి వాణి, ముగం ఆంజనేయులు, కళ్లేపల్లి సుగుణశేఖర్,మన్నెం వీరనాగేంద్రరావు,వడ్లమూడి రవీంద్రబాబు, పెద్దుబోయిన శ్యామలా దేవి, నూతులపాటి లక్ష్మీపావని, ఎక్స్ అఫీషియో సభ్యునిగా అర్చకుడు రుద్రపాటి శరత్చంద్ర శివ సంతోష్ శర్మ పాల్గొన్నారు.



మున్సిపల్ లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

### పురపాలక సంఘం లోగో ఆవిష్కరణ

గుడివాడ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : గుడివాడ మున్సిపల్ యంత్రాంగం రూపొందించిన పురపాలక సంఘం లోగోను గురువారం స్థానిక పురపాలక సంఘం కమిషనర్ కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1937లో ఆవిర్భవించిన పురాతనమైన గుడివాడ పురపాలక సంఘానికి నేటి వరకు లోగో లేకపోవడం విచారకరమన్నారు. పురపాలక సంఘాన్ని అభివృద్ధి చేద్దామన్న ఆశయంతో అనేక ప్రత్యేకతలతో లోగోను రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ ఇంజినీరు ప్రసాద్,అసిస్టెంట్ టౌన్ ప్లానర్ ఏసుబాబు, అకౌంట్స్ అధికారి జి.టి నాయుడు, లోగో రూపకర్త ఉదయ్ గోటేటి, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ ఇన్విటేషన్ బాస్కెట్‌బాల్ పోటీలు 27 నుంచి

గుడివాడ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) :ఎన్టీఆర్ మెమోరియల్ రాష్ట్రస్థాయి ఓపెన్ ఇన్విటేషన్ బాస్కెట్‌బాల్ పోటీలను ఈ నెల 27,28,29తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక స్టేడియం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్‌కు సంబంధించిన జట్లు మాత్రమే పాల్గొనాలన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు భోజనవసతి కల్పించనున్నామన్నారు. గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.15వేలు, రెండవ బహుమతిగా రూ.10వేలు, మూడవ బహుమతిగా రూ.7వేలు, టోర్నమెంట్ బెస్ట్ షూటర్‌కు రూ.1500లు, బెస్ట్ ప్లేయర్‌కు రూ.1500లు ఇవ్వనున్నామన్నారు. మరిన్ని వివరాలకు స్టేడియం బాస్కెట్‌బాల్ కోచ్ నెం.88869 26773కు సంప్రదించాలని యలవర్తి సూచించారు. ఈ సమావేశంలో స్టేడియం సంయుక్త కార్యదర్శి రంగప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

బాస్కెట్‌బాల్ పోటీలకు రిఫరీగా స్టేడియం కోచ్

ఉత్తరఖండ్, డెహ్రాడూన్‌లో అక్టోబరు 4నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే 50వ సబ్ జూనియర్స్ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు రిఫరీగా స్టేడియం బాస్కెట్‌బాల్ కోచ్ జి.మల్లిఖార్జునరావు వ్యవహరించనున్నట్లు స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు.

## విద్యతోనే సమాజంలో ఉన్నతి సాధ్యం

●సీఐ వి.సుభాకర్

పామర్రు,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు,క్రమశిక్షణ,నైతిక విలువలతో కూడిన విద్యతోనే ఉన్నత స్థానానికి చేరుకోగలుగుతారని పామర్రు సీఐ వి.సుభాకర్ అన్నారు. స్థానిక కంచర్ల రామారావు జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం విద్యార్థులకు చట్టాల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే చట్టాల పట్ల అవగాహన పెంపొందింప జేసుకోవాలన్నారు. మంచి నడవడితో ఉన్నత స్థాయికి ఎదిగేలా పాఠశాల స్థాయినుంచే ఎదిగేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కళ్లెదుట జరిగే అన్యాయాలు, అక్రమాలపై తక్షణమే స్పందించి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈవ్‌టీజింగ్‌లకు పాల్పడవద్దని యువతకు ఉపదేశించారు. మహిళల పట్ల ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా,వేధింపులకు గురి చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీటితో పాటు సైబర్ నేరాలు, బాలికలకు,మహిళల రక్షణకు అమలు జరుగుతున్న పోక్సో చట్టాల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎసై రాజేంద్రప్రసాద్, హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాసరావు,ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ సుభాకర్

## రైతులకు ఈక్రాప్ నమోదు తప్పనిసరి

● వి.శివనాగరాణి

పామర్రు,సెప్టెంబరు18(ఆంధ్ర జ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు వచ్చిన సమయంలో పంట నష్ట పరిహారం పొందేందుకు, ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలను ఈ క్రాప్ నమోదుతోనే రైతులు అమ్ముకోవాల్సి ఉం టుందని గ్రహించాలని పామర్రు మండల వ్యవసాయాధికారిణివి.శివనాగరాణి అన్నారు. మండల పరిధిలోని రాపర్ల గ్రామంలో గురువారం పోలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ, వరిపంటకు అక్కడక్కడ ఆకు మచ్చ తెగుళ్ల సోకడం గుర్తించడం జరిగిందన్నారు.దాని నివారణకు అవసరమైన చర్యలను రైతులకు వివరించారు. ఖరీఫ్ సాగు చేసిన రైతన్నలకు ఈనెలఖారు వరకు పంట నమోదు గడువును ప్రభుత్వం పొడిగించడం జరిగిందన్నారు. దానికి అనుగుణంగా తప్పని సరిగా ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. అదే విధంగా ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రాయితీ పదకాలను వివరించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంట నమోదు వల్ల జరిగే ఇతర ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శివనాగరాణి

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జయలక్ష్మి

గుడివాడ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో ఉండాలని గుడివాడ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జయలక్ష్మీ పేర్కొన్నారు. గురువారం స్థానిక రాజేంద్రనగర్‌లోని టౌన్ హైస్కూల్‌లోని 8,9,10తరగతుల విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఈగల్ ఛీఫ్ ఆకె రవికృష్ణ ఆదేశాల మేరకు నార్కోటిక్స్ యాంటిబయాటిక్స్ మాదకద్రవ్యాలు , దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి వినియోగించే వారి గురించి గానీ, అమ్మేవారి గురించి గానీ ఎటువంటి సమాచారం అందిన వెంటనే టోల్ ఫ్రీ నెం. 1972కు తెలియజేయాలని కోరారు. నిత్యం వాడే మందులు గురించి ఏమైన ఫిర్యాదులుంటే టోల్‌ఫ్రీ నెం.104కు తెలపాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై పి.గౌతమ్‌కుమార్, ఈగల్ టీం సభ్యులు మూర్తి, రోటరీక్లబ్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జయలక్ష్మి



బోనస్ అందిస్తున్న మేనేజర్ గోపీనాథ్

### పాల ఉత్పత్తిదారులకు బోనస్

కూచిపూడి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కృష్ణామిల్క్ యూనియన్, కూచిపూడి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో 52 మంది సభ్యులకు పాల బోనస్‌ను గురువారం అందజేశారు. "పామర్రు పాలశీతలీకరణ మేనేజర్ దామోదర కృష్ణ గోపీనాథ్ సొసైటీ అధ్యక్షురాలు మనోహరి, కార్యదర్శి సత్యశ్రీనివాస్,సుబ్రహ్మణ్యం, డైరెక్టర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యశ్రీ

### గర్భిణులకు పోషకాహారం తప్పనిసరి

పామర్రు : గర్భిణిలు,బాలింతలకు ప్రభుత్వం అందించే పోషకారాన్ని తీసుకుని ఆరోగ్యవంతమైన బిడ్డను సమాజానికి అందించాలని పామర్రు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నూతక్కి సత్యశ్రీ అన్నారు. స్థానిక 18వార్డులోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం గర్భిణీలకు,బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు.



జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ ఆధ్వర్యంలో...

### ఎంపీ బాలశౌరి జన్మదిన వేడుకలు

గుడివాడ : మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి జన్మదిన వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక కొత్త మున్సిపల్ కార్యాలయం వద్ద జనసేన జిల్లా నాయకులు సందు పవన్ ఆధ్వర్యంలో పేదలకు స్వీట్లు, ఫ్రూట్‌జ్యూస్‌లను అందజేశారు. టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహనరావు, పాల్గొన్నారు. స్థానిక జనసేన నియోజకవర్గ కార్యాలయంలో ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పుట్టినరోజు కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. గుడివాడలో నిర్మిస్తున్న రైల్వే ఫ్లైఓవర్‌కు ఎంపీ బాలశౌరి పేరు పెట్టాలని చిరంజీవి అభిమాన సంఘం నాయకులు దాసరి మహేష్ బూరగడ్డకు వినతిపత్రం అందజేశారు.

కాకర్ల వీధిలోని ఏకేటీపీ మున్సిపల్ బాలికల ఉన్నతపాఠశాలలో జనసేన జిల్లా నాయకులు దాసరి మహేష్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. మహేష్ వితరణతో అందజేసిన తరగతి గదులకు అవసరమైన సీలింగ్ ఫ్యాన్‌లను అందజేశారు. జనసేన నాయకులు శ్రీనివాసరావు, త్రినాద్, పాల్గొన్నారు.

## అంతర్ పాఠశాలల క్రీడాపోటీలు ప్రారంభం



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

గుడివాడ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎస్‌పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే అండర్-14,17 బాలబాలికల అంతర్ పాఠశాలల క్రీడాపోటీలు, మండల టీమ్ సెలక్షన్స్ గురువారం ప్రారంభమయ్యాయి. గురువారం ఖో-ఖో, వాటీబాల్, కబడ్డీ, షటిల్, చెస్, యోగా పోటీలను నిర్వహించారు. తొలుత గంగాధరపురం పాఠశాల స్కూల్ అసిస్టెంట్ ఎం.జ్యోతిని ఘనంగా సత్కరించారు. మండలం నుంచి పెద్ద సంఖ్యలో బాలబాలికలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి-2 బాలాజీ, ఎస్‌పీఎస్ ప్రధానోపాధ్యాయులు వై.శ్రీనివాసరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ టి.శ్రీనివాస్, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉద్యానవన పంటలకు ప్రభుత్వ రాయితీ

పమిడిముక్కల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉద్యాన వన పంటలు పండించే రైతులకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీ సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన వన శాఖ డీడీహెచ్ జ్యోతి అన్నారు. అగినపర్రులో గురువారం రైతుశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూరగాయలసాగుపై గరిష్టంగా హెక్టారుకు రూ. 24వేలు, పూలసాగుకు హెక్టారుకు రూ 20వేలు ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. ఆయి ల్‌పామ్ పథకంలో మొక్కల కొనుగోలుపై 100 శాతం రాయితీ, హెక్టారుకు 143 మొక్కలు, దేశవాళీ మొక్కలకు రూ. 20వేలు , ఇతర దేశాలనుండి దిగుమతి చేసుకునే వాటికి రూ. 29వేలు రాయితీ ఇస్తుందని తెలిపారు. ఆయిల్‌పామ్ వేసే రైతులకు మొదటి 4 సంవత్సరములు, ప్రధాన , అంతరపంటల నిర్వహణకు రూ. 21వేలు చొప్పున ప్రభుత్వం ఇస్తుందన్నారు. సామూహిక ఎలుకల నివారణకు ప్రభుత్వం 100 శాతం రాయితీతో మం దు ఇస్తుందని గన్నవరం ఏడీఏ సునీల్ తెలిపారు. ఈ- క్రాప్ నమోదు ఈనెల 30తో ముగియ నుండగా రైతులు తప్పక నమోదు చేయించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి గణేశ్‌రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.



యాజమాన్య పద్ధతులు తెలియ జేస్తున్న జ్యోతి

## వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని ఆందోళనలు

కూచిపూడి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఆర్‌ఏలు మొవ్వలో గురువారం ధర్నా నిర్వహించారు. అర్హులకు ప్రమోషన్లు కల్పించాలనీ, కారుణ్య నియామకాలు చేపట్టాలని, పే స్కేలు అమలుచేయాలని, నామినీలను వీఆర్‌వోలుగా నియమించాలని డిమాండ్ చేశారు. సంఘ అధ్యక్షుడు పెడసనగంటి రాజేష్ పాల్గొన్నారు.

పామర్రు: గ్రామ రెవెన్యూ సహాయకులు ఎదుర్కొంటున్న న్యాయ బద్ధమైన డిమాండ్లను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా తహసిల్దార్ జి రవికాంత్‌కు వినతీ పత్రం అందజేశారు. విఆర్ఏల సంఘ నాయకుడు జేబాబుజీ,,చాట్ల రమేష్,దాసరిప్రసాద్, ప్రభాకర్,బేబి తదితర్లు పాల్గొన్నారు.



పామర్రు తహసిల్దార్ కార్యాలయం వద్ద జరిగిన నిరసనలో పాల్గొన్న వీఆర్‌ఏలు

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం మండల వీఆర్‌ఏలు ధర్నా చేపట్టారు. పే స్కేలు అమలు చేయాలని, నామినీలను వీఆర్ఎలుగా నియమించాలని, అర్హులకు పదోన్నతులు కల్పించాలని, కారుణ్య నియామకాలకు అవకాశం కల్పించాలని తదితర డిమాండ్లతో వీఆర్‌ఏలు ధర్నా నిర్వహించారు. ధర్నాలో మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు ఏసుబాబు, కార్యదర్శి వి దుర్గాప్రసాద్, స్వర్ణ శివలీల పాల్గొన్నారు.

### నిందితుడికి 14రోజుల రిమాండ్

గుడివాడ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : స్థానిక ముబారక్ సెంటర్‌లో నివాసముండే 10వ తరగతి బాలికను కిడ్నాప్ చేసిన కేసులో నిందితుడు సయ్యద్ ఇమ్రాన్‌ను అదుపులోకి తీసుకుని ఏజెఎఫ్ సీఎం కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా 14రోజులు రిమాండ్ విధించినట్లు వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గురువారం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి కిడ్నాప్‌కు గురైన బాలికను తల్లిదండ్రులు అప్పగించారు. నిందితుడిని మచిలీపట్నం జిల్లా జైలుకు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

### మోటారు చోరీ

గుడివాడ : స్థానిక నాగవరప్పాడుకు చెందిన రైతు కుందేటి వెంకటేశ్వరరావునీటిని తోడేందుకు రూ.35వేలు విలువ గల మోటారును పొలంగట్టుపై ఏర్పాటు చేసుకున్నాడు. బుధవారం రాత్రి ఇంటికి వచ్చే సమయంలో అక్కడే ఉంచి, 18వ తేదీ గురువారం ఉదయం వెళ్లి చూస్తే మోటారు కనిపించలేదని యిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఏఎస్సై ప్రసాద్ తెలిపారు.

### చీటింగ్ కేసు నమోదు

గుడివాడ : కార్మికనగర్‌లోని రమా రైస్ మిల్లు యజమాని గొట్టిపాటి సత్యనారాయణ స్థానిక బంటుమిల్లిరోడ్డులోని మహాలక్ష్మీ రైస్ ట్రేడర్స్ అధినేత బూరగడ్డ శివరామకృష్ణకు రూ.9లక్షలు విలువ గల 26కేజీల బరువు కలిగిన 193 బస్తాల బియ్యాన్ని అప్పుగా పంపిణీచేశాడు. నగదు చెల్లించే విషయంలో ఎన్నిసార్లు అడిగిన దాటవేస్తున్నాడని సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం శివరామకృష్ణపై 420 కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై పి.గౌతమ్‌కుమార్ తెలిపారు.

### ఎలుకల నివారణే ధ్యేయం

గుడివాడ రూరల్ : రైతులు సామూహికంగా ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలని ఏవో బోలెం అనంత లక్ష్మీ తెలిపారు. నాగవరప్పాడు ఆర్ఎస్‌కే సెంటర్‌లో రైతులకు ఉచితంగా ఎలుకల నివారణ మందును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

### కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

పమిడిముక్కల : తాడంకి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణలో గురువారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 20 బాలురు, బాలికల కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక నిర్వహించారు. ఎంపికైన జట్లు ఈనెల 25న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాంచారయ్య, రవీంద్రబాబు తెలిపారు. బాలికల జట్టుకు తాడంకి స్కూల్ విద్యార్థినులు కె.గీతాంజలి, బి.వెంకటలక్ష్మి ఎంపికయ్యారు.

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 133, 142, 153 |
| చికెన్ విత్ స్కిన్ | 254 |
| చికెన్ స్కిన్‌లెస్ | 264 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

## జీతాలు పెంచాలంటూ మున్సిపల్ కార్మికుల ధర్నా

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీతాలు పెంచాలంటూ మునిసిపల్ పారిశుధ్య కార్మికులు గురువారం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకులు బి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో కార్మిక నాయకులు సమస్యలను వివరించారు. చిరువోలు జయరావు, సిహెచ్. బుల్లెమ్మ, శీరంశెట్టి దుర్గాప్రసన్నుడు, ఏ. స్వప్న, ఎస్. దుర్గాభవానీ, ఆర్. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాది అనీష్ అహమ్మద్ రజా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు

## అనీష్ అహమ్మద్ రజాకు బార్ నివాళి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ న్యాయవాది అనీష్ అహమ్మద్ రజా న్యాయ సేవలు చిరస్మరణీయమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివి పోతురాజు అన్నారు. బార్ అసోసియేషన్ హాలులో గురుఆరం సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అనీష్ అహమ్మద్ రజాకు ఘనంగా నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి సుధాకర్, సీనియర్ న్యాయవాది నగదరనాథ్, పీపీలు లంకే వెంకటేశ్వరరావు, మాదివాడ నరసింహారావు, న్యాయవాదులు శీతల ప్రసాద్, ఎండీ రఫీ తదితరులు అనీష్ అహమ్మద్ రజా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివి పోతురాజు మాట్లాడుతూ, సంతాప సభలు సాయంత్రం 4.20 నిమిషాలకు మాత్రమే బార్ అసోసియేషన్ హాలులో నిర్వహించాలని హైకోర్టు సర్క్యులర్ జారీ చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. దీనిపై హైకోర్టు ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు. అనీష్ అహమ్మద్ రజా మృతికి న్యాయవాదులు శ్రద్ధాంజలి ఘటించారు.

## గోపీచంద్‌ను విమర్శించే హక్కు వైసీపీ నాయకులకు లేదు



విలేకరులతో మాట్లాడుతున్న పి.వి.ఫణికుమార్

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కరోనా సమయంలో రోగులకు సొంత నిధులతో ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు ఇచ్చి పలువురి ప్రాణాలను కాపాడిన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్‌ను విమర్శించే హక్కు వైసీపీ నాయకులకు లేదని టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పి.వి.ఫణికుమార్ అన్నారు. శిడింబి అగ్రహారంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోవిడ్ సమయంలో ప్రజల ఆరోగ్యాన్ని వైసీపీ నాయకులు గాలికి వదిలేశారన్నారు. గోపీచంద్ గొర్రెపాటి రేవతి మెమోరియల్ ట్రస్టు ద్వారా వందలాది పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు ఆర్థిక సాయం అందించారన్నారు. కొవిడ్ సమయంలో ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు అందించిన గొప్ప మానవతావాది అన్నారు. పదవులు ఉన్నా లేకపోయినా గోపీచంద్ ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. రంగనాయకస్వామి దేవాలయం భూముల వేలం పాటలో పాల్గొనేందుకు గోపీచంద్, ఆయన భార్య డిపాజిట్ కట్ట లేదన్నారు. గోపిచంద్‌పై వైసీపీ నాయకులు చేస్తున్న వన్నీ అసత్యాలేనన్నారు. టీడీపీ నాయకులు గంజాల రవికుమార్, కేదరాశి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## మళయాళ స్వామి ఆశ్రమంలో ఉచిత వైద్యశిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న పరిపూర్ణానందగిరి స్వామి

ఘంటసాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిలోని మళయాళస్వామి ఆశ్రమంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానంద గిరిస్వామి అన్నారు. తాడేపల్లి గ్రామానికి చెందిన సూరపనేని రామలింగయ్య - వెంకట్రావమ్మల జ్ఞాపకార్థం మనుమడు శ్రీనివాస్, కుటుంబసభ్యులచే శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఉత్తరాధికారి అసగానంద స్వామి, టీడీపీ నేత పరుచూరి సుభాష్ చంద్రబోస్ గురువారం ప్రారంభించారు. టీడీపీ నేత సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ, 24వ తేదీ వరకు ప్రతి రోజు 100 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించటం, 22వ తేదీ నుంచీ 26వ తేదీ వరకు అవసరమైన వారికి ఆపరేషన్లు ఆశ్రమ ప్రాంగణంలోనే మొబైల్ వాహనంలో నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆశ్రమ నిర్వాహకులు కావూరి కోదండరామయ్య, కొత్తపల్లి సొసైటీ అధ్యక్షుడు గొర్రెపాటి సురేష్, టీడీపీ నేత యార్లగడ్డ వీరభద్రరావు, సూరపనేని వెంకట్రావ్, మైనేని వెంకటేశ్వరరావు, మొవ్వ ప్రసాదరావు, మొవ్వ శ్రీరామమూర్తి, శంకర్ నేత్రాలయ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.




అవనిగడ్డలో ధర్నా చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు

## సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏల ధర్నా

అవనిగడ్డ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోరుతూ అవనిగడ్డలో గురువారం గ్రామ రెవెన్యూ సహాయకులు ధర్నా నిర్వహించారు. వీఆర్ ఏలకు పేస్కేల్ అమలుచేయాలని, అర్హులైన వారికి వీఆర్వో, అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్లుగా పదోన్నతి కల్పించాలని, నామినీ వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. మునిపల్లి వెంకటేశ్వరరావు, మునీశ్వరరావు, సంపూర్ణరావు, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు. **బంటుమిల్లి :** సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం బంటుమిల్లి డివిజన్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ పూర్ణచంద్రరావుకు అర్జీ ఇచ్చారు. దయాకరరావు, విజయసారధి, కోటయ్య, సుబ్బారావు, శ్రీనివాసరావు, భాస్కరరావు, ఆదినారాయణ, మైడియ్య, లవయ్య, వెంకటేశ్వరరావు, ఆదినారాయణ, సుబ్బారావు, కుమార్, శివనారాయణ, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కుమార్‌కు సన్మానం



ప్రిన్సిపాల్ కుమార్‌ను సన్మానిస్తున్న సర్పంచ్, విజయకుమార్, ఈవో అనిత

అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పదవీ విరమణ చేసిన పులిగడ్డ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌టిపి.కుమార్‌ను సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్, ఈవో బి.అనిత గురువారం ఘనంగా సన్మానించారు. గురుకుల పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా వచ్చిన నాటి నుంచి కుమార్ పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు క్రమశిక్షణ, చదువు పట్ల శ్రద్ధ కలిగేలా చేయటంలో కీలకపాత్ర పోషించారన్నారు. జూనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, పంచాయతీ సిబ్బంది కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి మృతిపై అనుమానాలు

**● మృతదేహానికి రీ-పోస్టుమార్టం**

నాగాయలంక, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నాలి గ్రామానికి చెందిన నాయుడు సులోచన మనవడు నాయుడు డానియల్‌బాబు (19) గత నెల 27వ తేదీ రాత్రి ఉరివేసుకుని చనిపోయాడు. మృతుడి నాయనమ్మ సులోచన 28వ తేదీన నాగాయలంక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. కొడుకు మృతిపై తల్లి నాయుడు అమ్మాయమ్మ, బంధువులు అనుమానాలను వ్యక్తం చేశారు. దీంతో అవనిగడ్డ డీఎస్పీ ఆదేశాల మేరకు నాలి శ్మశాన వాటికలో ఖననం చేసిన డానియల్‌బాబు మృతదేహాన్ని గురువారం వెలికితీసి మచిలీపట్నం ఫోరెన్సిక్ వైద్యుల బృందం పరీక్షలు నిర్వహించారు. అవనిగడ్డ సీఐ జి.యువకుమార్, తహసీల్దా సిహెచ్.వీరాంజనేయప్రసాద్, ఎస్సై కె.రాజేష్, రెవెన్యూ అధికారుల సమక్షంలో మృతదేహానికి రీ పోస్టుమార్టం చేశారు. గ్రామపెద్దలు, మృతుని కుటుంబ సభ్యులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



ఎంపీ బాలశౌరి జన్మదినం సందర్భంగా కేకు కట్ చేస్తున్న కొట్టె వెంకట్రావు, చల్లపల్లిలో జరిగిన వేడుకల్లో మండలి వెంకట్రామ్, చిలకలపూడి పాపారావు

# ఘనంగా ఎంపీ బాలశౌరి జన్మదిన వేడుకలు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజల పక్షాన నిలుస్తూ పార్లమెంట్‌లో గళం విప్పుతూ ఎదురులేని నాయకుడిగా రాణిస్తున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి అందరికీ ఆదర్శప్రాయుడయ్యారని జనసేన నాయకులు కొట్టే వెంకట్రావు, మాదివాడ రాము అన్నారు. నాయర్‌బడ్డీ సెంటర్‌లోని ఎంపీ కార్యాలయంలో బాలశౌరి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని మచిలీపట్నం, పెడన, పామర్రు నియోజకవర్గాలకు చెందిన జనసేన నాయకులు పలువురు పాల్గొన్నారు. వీర మహిళలు వృద్ధాశ్రమాల్లో, ఆసుపత్రుల్లో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. **పెడన :** తోటమూల టీడీపీ కార్యాలయంలో గురువారం ఎంపీ వల్లభనేని బాలశౌరి 58వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణు గోపాలరావు పాల్గొని కేకు కట్ చేసి బాలశౌరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జనసేన పార్టీ కౌన్సిలర్ మట్టా శివపావని, జనసేన నాయకులు మట్టా నాని, కొట్టు కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు యక్కల శ్యామలయ్య, చందన నారాయణరావు, కమ్మగంటి బాబు, వీణం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి :** బాలశౌరి జన్మదినాన్ని పురస్కరించుకుని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆయన పేరున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన కూడలిలో పూషడపు రత్నగోపాల్, నడకుదిటి జనార్దనరావు కేకు కట్‌చేశారు.

**● వృద్ధాశ్రమాల్లో అన్నదానం**

**నాగాయలంక:** ఎంపీ బాలశౌరి జన్మదిన వేడుకలు డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగమల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. కేక్ కట్‌చేశారు. జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** ఎంపీ వల్లభనేని బాలశౌరి పుట్టినరోజు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో బాలశౌరి పేరుతో ప్రత్యేక పూజలు చేయిస్తున్న కూటమి నేతలు

వేడుకలు గురువారం వంతెన సెంటరులో ఘనంగా జరిగాయి. యువనేత మండలి వెంకట్రామ్ కేక్ కట్‌చేశారు. కొల్లూరు వెంకటేశ్వరరావు, రాయపూడి వేణుగోపాల్, యాసం చిట్టిబాబు, మత్తి శ్రీనివాసరావు, యలవర్తి చిన్నా, మాదివాడ రత్నారావు, బచ్చు రఘునాథప్రసాద్, రాజనాల వీరబాబు, బొప్పన భాను, మండలి వెం కటేశ్వరరావు, బండె కనకదుర్గ, బచ్చు కృష్ణకుమారి, ఘంటసాల కన్నయ్య పాల్గొన్నారు. **చల్లపల్లి :** ఎంపీ బాలశౌరి జన్మదిన వేడుకలను చల్లపల్లిలో ఘనంగా నిర్వహించారు. సొసైటీ చైర్‌పర్సన్ బొందలపాటి వీరబాబు ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఇద్దరు చిన్నారులకు జనసేన నేత చంద్రశేఖరరావు వెయ్యి రూపాయల చొప్పున అందజేశారు. ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, నేతలు ఉరిమి మణికాంత్, తోట మురళీకృష్ణ, మిరియాల జితేంద్ర, గోళ్ల ప్రసాద్, అడపా రవి, ఎం.రంజిత్‌కుమార్, సూదాని నందగోపాల్, రాయవరపు నాంచారయ్య, నల్లమోతు వీరయ్య, టీడీపీ నేతలు రావి రాజు, తుటారం ప్రసాద్ పాల్గొన్నారు. జనసేన నేతలు అడపా రాంబాబు ఆధ్వర్యంలో సీయోను వృద్ధాశ్రమంలో, కోసూరు శివాజీ ఆధ్వర్యంలో ఆదరణ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్న దానం చేశారు. ఎంపీ బాలశౌరి పుట్టినరోజును వృద్ధుల నడుమ చేయగా, చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. పూషడపు రత్నగోపాల్, గంగిశెట్టి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు. సొసైటీ చైర్మన్ బొందలపాటి వీరబాబు ఆధ్వర్యంలో బీసీ బాలుర వసతిగృహంలో విద్యార్థులతో కేక్ కట్‌చేయించారు. పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ బోలెం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ చూపాలి

చల్లపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆరోగ్యంగా ఉండాలనీ, ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ వహించాలని జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ అధికారి డాక్టర్ ఎ.వి.శేషకుమార్ అన్నారు. చల్లపల్లి సామాజిక ఆరోగ్యకేంద్రంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిగా పాల్గొన్నా రు. అక్టోబరు రెండవ తేదీ వరకు మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు స్ర్కీనింగ్ పరీక్షలు, కిశోర బాలికల ఆరోగ్య పరీక్షలు, మానసిక, ఆయుష్ వైద్యసేవలు, తల్లిబిడ్డ సేవలు, వయోవృద్ధులకుఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రిలో మహిళలకు కంటి పరీక్షలు నిర్వహించి, తగు సూచనలు చేశారు. ఆసుపత్రి వైద్యులు,



డీసీహెచ్ఎస్ డాక్టర్ శేషుకుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరరావు

సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ బీఎస్ఆర్ శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. **కోడూరు :** మహిళల ఆరోగ్యమే దేశానికి శ్రీరామరక్ష అని పిట్టల్లంక సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు అన్నారు. స్వతంత్రపురం పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ రాణి ఆధ్వర్యంలో పిట్టల్లంక గ్రామంలో నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్తి పరివార్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మహిళల ఆరోగ్యం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నాయన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమన్నారు. బడేవారిపాలెం సొసైటీ అధ్యక్షుడు మర్రే గంగయ్య, వైద్య సిబ్బంది అప్పికట్ల తారకమస్తాన్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. **గూడూరు :** నారికేడలపాలెంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ కార్యక్రమం నిర్వహించారు. 76 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మల్లవోలు పీహెచ్‌సీ డాక్టర్ తరుణ్‌శంకర్, ఆలపాటి సత్యనారాయణ (నా ని), పోలగాని నాని, గ్రామ మహిళా పోలీస్ పావని, సరళ, హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



# మండలి వెంకట కృష్ణారావుకు అవనిగడ్డలో ఘననివాళి

అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలి వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకలు పండుగ వాతావరణంలో జరుగుతున్నాయి. తుంగలవారిపాలెం గ్రామ కూటమి నాయకులు, ప్రజలు, మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి కృష్ణారావు విగ్రహానికి నివాళులు అర్పించారు. కూటమి నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నాగాయలంక : నాగాయలంకలోని దివంగత మండలి వెంకట కృష్ణారావు విగ్రహం వద్ద శతజయంతి వేడుకల సందర్భంగా గురువారం 46వ రోజున కూటమి నేతలు మండలి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తలశిల స్వర్ణలత, మెండు లక్ష్మణరావు, బండ్రెడ్డి నాగమల్లిఖార్జునరావు, మండలి ఉదయభాస్కర్, తలశిల వెంకట నరసింహారావు, గుడివాక శివరావు, తోట శ్రీనివాసరావు, పిరాటి శిరీష, మాదివాడ అర్జునరావు, తానంకి చంటి, తలశిల రామకృష్ణ, ముక్కొల్లు శివ, గుడివాక శివాజీ, చన్నగిరి లతామోహన్, బండ్రెడ్డి హరి, మల్లిఖార్జున్, తలశిల శివరామకృష్ణ, దున్నా రాజేష్, బండ్రెడ్డి బోసు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కార వేదికలో రైతులకు అవమానం



సమస్యలపై కలెక్టరేట్‌లో ఇచ్చిన అర్జీలను చూపుతున్న రైతు నాయకులు

కోడూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సమస్యలు పరిష్కరించకుండా, సమస్య పరిష్కారమైందంటూ మెసేజ్‌లు పంపిస్తూ రైతులను అవమానిస్తున్నారని మండల రైతుసంఘం నాయకులు ఆవుల బసవయ్య ఆరోపించారు. కోడూరు రైతుసంఘం కార్యాలయం వద్ద గురువారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. ఇరాలి గ్రామం వద్ద రత్నకోడు మేజర్ డ్రెయిన్ నుంచి న్యూ ఇరాలి డ్రెయిన్‌లోకి అక్రమం గా వేసిన తూములు తొలగించాలని ఇప్పటికి మూడుసార్లు అర్జీ ఇచ్చినప్పటికీ పరిష్కరించకుండా, అధికారులు పరిశీలన కూడా చేయకుండా సమస్య పరిష్కారమైందంటూ మెసేజ్‌లు పంపారన్నారు. పరిష్కారవేదికలో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతుసంఘం నేతలు రేపల్లె యోగప్రకాష్, చెక్కా మోహనరావు, జొన్నలగడ్డ గోపాలరావు, పొనమాల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## నీటి పొదుపుపై విద్యార్థులకు అవగాహన

గూడూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చిట్టిగూడూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛత అవగాహనలో భాగంగా గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. నీటిని పొదుపుగా వాడటం, వర్షపునీటి సంరక్షణ పద్ధతులపై విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు జి. నవీన్ బాబు అవగాహన కల్పించారు. సర్పంచ్ లంక చంద్రలీల, క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు జి.విజయకుమారి, లక్ష్మీనారాయణ, గౌరిపర్తి వెంకటేశ్వరరావు, స్వరాజ్యలక్ష్మి, కె. ఏడుకొండలు పాల్గొన్నారు.

## పిల్లల్లో ఊబకాయంపై అవగాహన

పెడన, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం బ్రహ్మపురం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల్లో ఊబకాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఊబకాయం రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోషక విలువలు కలిగిన ఆహారం పిల్లలకు అలవాటు చేయాలన్నారు. ఫాస్ట్‌ఫుడ్స్ జోలికి పిల్లలను వెళ్లనీయవద్దన్నారు. ఉషారాణి, మాలతి, ఆయాలు, పిల్లల తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

## పొదుపుపై డ్వాక్రా మహిళలకు అవగాహన

పెడన రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాల సభ్యులు తెలుసుకునే విధంగా ప్రభుత్వం మన డబ్బులు-మన లెక్కలు అనే విధానాన్ని ప్రవేశపెట్టిందని జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్ అన్నారు. కొంకేపూడిలో మండల సమైక్య ఆధ్వర్యంలో స్వయం సహయక సంఘ సభ్యులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. స్మార్ట్ ఫోన్‌లలో ఈనారీ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని పొదుపు, రుణం, చెల్లింపుల వివరాలను తెలునుకోవాలని జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్ అన్నారు. ఏపీఎం శ్రీదేవి, శంకరరావు, నాగరాజు, వెంకటేశ్వర్లు, సుజాత, పోలగాని రామ్మోహనరావు, గ్రామైక్య సభ్యులు పాల్గొన్నారు.

## సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలి

అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్ పరిధిలోని అవనిగడ్డ, మోపిదేవి, నాగాయలంక, కోడూరు మండలాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించి 23 వేల హెక్టార్ల విస్తీర్ణానికి 230 కిలోల బ్రోమోడయోలి మందును పంపిణీ చేసినట్లు ఏడీఏ జె.ఎస్.జయప్రద తెలిపారు. వేకనూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, మండల వ్యవసాయ అధికారులు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు. **కోడూరు :** సామూహిక ఎలుకల నివారణ రైతులు సామూహికంగా చేపట్టాలని ఏఈవో ఎం.శ్రీధర్ తెలిపారు. పలు గ్రామాల్లో సామూహిక ఎలుకల నివారణ నిర్వహించారు.